సత్యసాయి నీటి సరఫరా బంద్

అర్ధరాత్రి నుంచి కార్మికుల సమ్మెబాట

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి నీటి పథకం కార్మికులు జీతాల కోసం సమ్మెబాట పట్టారు. ఈ పథకం 1995లో ప్రారంభం కాగా. . 2021 వరకు ఎల్అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు జీతాలు ఇచ్చేవారు. అనంతరం గుత్తేదారుల పరిధిలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోంది. కార్మికుల నిరసనలు, సమ్మెలు సర్వసాధారణమయ్యాయి. తాజాగా సోమవారం అర్ధరాత్రి నుంచి నీటి సరఫరాను నిలిపివేసి.. మరోసారి సమ్మెబాట పట్టారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, రాప్తాడు, తాడిపత్రి, శింగనమల, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని 1,341 గ్రామాల్లోని సుమారు 16.40 లక్షల మందికి ఈ పథకం నీరందుతోంది. రోజుకు 1.50 కోట్ల లీటర్ల నీరు పంపింగ్ జరుగుతోంది.

కళ్యాణదుర్గం పంప్‌హౌస్ వద్ద మోటార్లు ఆపుతున్న కార్మికులు

బకాయిలు రూ. 7 కోట్లు

ఈ పథకంలో 570 మంది కార్మికులు పని చేస్తుండగా.. ఒక్కొక్కరికి నెలకు జీతం రూ. 18 వేల నుంచి రూ.20వేలు, పీఎఫ్ రూ. 2,500 చొప్పున ప్రతి నెలా రూ. 1.40 కోట్లు అందించేవారు. అయిదు నెలలుగా బకాయి వేతనాలు రూ. 7 కోట్లు చెల్లించాల్సి ఉంది.

బడ్జెట్ రాక.. ఇవ్వని పరిస్థితి - రామారావు, డీఈ, సత్యసాయి బోర్డు, అనంతపురం

జిల్లా అధికారులతో కలిసి ఇప్పటికే సమస్యను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. గతంలో మున్సిపాలిటీ, పంచాయతీ నిధుల ద్వారా సర్దాం. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాక కార్మికులకు 5 నెలల జీతాలు ఇవ్వలేక పోయాం. వారు సమ్మెలోకి వెళితే తాగునీటి ఇబ్బందులు జఠిలమవుతాయి.

తాగుకు 8.. సాగుకు 8.097 టీఎంసీలు!

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణ తేదీ ఎట్టకేలకు ఖరారైంది. 1వతేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. తీవ్ర వర్షాభావం, ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో జలాలు రాని పరిస్థితుల్లో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. హెచ్చెల్సీ వాటాగా జిల్లాకు వచ్చే 16.097 టీఎంసీలను దామాషా ప్రాతిపదికన అన్ని రకాల జలాశయాలు, తాగునీటి పథకాలకు కేటాయించనున్నారు. అరకొర నీటిలోనూ ఆయకట్టుకు కొద్దిమేర ఇవ్వాలని అనుకున్నారు. మొత్తంగా 40 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు ఇవ్వనున్నారు. అందుకు అనుగుణంగా ఇప్పటికే కార్యాచరణ సిద్ధం కాగా.. సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకునే వీలుంది.

నేడు ఐఏబీ సమావేశం

వృథానే 5.774 టీఎంసీలు

ప్రస్తుత ప్రతిపాదిత గణాంకాల ప్రకారం.. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ వాటాగా 16.097 టీఎంసీలను కేటాయించారు. ఇందులో తాగునీటికి 8, సాగు నీటికి 8.097 టీఎంసీల ప్రకారం ఇవ్వాలని సంకల్పించారు. ఈ 16.097 టీఎంసీల్లో ఆవిరి, లీకేజీ, ఇతరత్రా వృథా కింద 5.774 టీఎంసీలు పోనున్నాయి. వృథా జలాలతో కలిపి ఆయకట్టుకు ఇచ్చే 8.097 టీఎంసీల్లో.. దామాషా ప్రకారం హెచ్చెల్సీ ప్రధాన కాలువకు 1.824, జీబీసీకి 1.716, ఎంపీఆర్ ఉత్తర, దక్షిణ కాలువలకు 2.464, పీబీసీ, టీబీసీ, మైలవరం కాలువలకు 2.093 టీఎంసీల ప్రకారం ఇవ్వాలని అనుకున్నారు. వీటిపైనే ఐఏబీ చర్చించనుంది.

ఆన్‌లైన్ పాఠాలు.. అంతులేని మోసాలు

ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో బాధితులు

ఈనాడు, పుట్టపర్తి, పామిడి

ఉద్యోగ సాధనకు.. ఉన్న కొలువును నిలుపుకోవడానికి.. కొత్త కోర్సులు నేర్చుకోవడం అనివార్యంగా మారింది. ఇంట్లోనే ఉంటూ సర్టిఫికేషన్ కోర్సులు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. ఇదే అదనుగా కేటుగాళ్లు నయా మోసాలకు తెరదీశారు. వీరి ఉచ్చులో పడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎంతో మంది యువతీ యువకులు బాధితులుగా మారుతున్నారు. వెనుకా ముందు ఆలోచించకుండా రూ.వేలల్లో ఫీజులు చెల్లించి.. మోసపోయామని ఆలస్యంగా తెలుసుకుని పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

● పామిడి మండలానికి చెందిన ఓ యువతి ఎంసీఏ పూర్తి చేసి.. బెంగళూరులోని ఓ కంపెనీలో పని చేస్తున్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు సాప్ కోర్సు నేర్చుకోవాలనుకున్నారు. అందుకోసం ఓ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో రూ. 27 వేలు చెల్లించారు. నాలుగైదు నెలలైనా తరగతులు ప్రారంభం కాకపోవడంతో వెబ్‌సైట్ చెక్ చేశారు. తాను తరగతులకు హాజరైనట్లు నమోదై ఉండటంతో మోసపోయినట్లు గుర్తించారు. హెచ్ఏఎల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● డబ్బు కట్టించుకుని మోసం చేస్తే వెంటనే '1930' హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి.. లేదా cyber-crime.gov.in వెబ్‌సైట్ ద్వారానూ ఫిర్యాదు చేయవచ్చు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందు ట్రాన్సాక్షన్ ఐడీలు, ఫోన్ నంబర్లు జత చేయడం తప్పనిసరి.

● 3నెలల్లో డేటా సైన్స్ నేర్చుకోండి. రూ. 50వేల జీతంతో ఉద్యోగం గ్యారెంటీ'.. 'తక్కువ ఖర్చుతో నైపుణ్య కోర్సులు' అంటూ సామాజిక మాధ్యమాల్లో రంగురంగుల ప్రకటనలు గుప్పిస్తున్నారు. రూ.వేలల్లో ఫీజులు చెలించిన తర్వాత వెబ్‌సైట్ మూసేసి ఉడాయిస్తున్నారు.

అప్రమత్తంగా ఉంటేనే..

✦ కోర్సులు, ఉద్యోగాల పేరుతో ఆన్‌లైన్‌లో వందలాది నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. కేవలం సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను చూసి నమ్మడం తగదు. ఆన్‌లైన్ కోర్సుల్లో చేరేముందు.. ఆ సంస్థకు యూజీసీ, ఏఐసీటీఈ, నాస్కామ్ వంటి అధికారిక సంస్థల ఆమోదం ఉందో లేదో నిర్ధారించుకోవాలి.

✦ కోర్సులు అందించే సంస్థల గురించి గూగుల్ రివ్యూలు, లింక్డ్ ఇన్ ప్రొఫైల్ వంటి ప్లాట్‌ఫాంల్లో గాలించాలి. సమీక్షలన్నీ ఒకే రోజు.. ఒకే తరహా భాషలో ఉంటే.. అవి నకిలీవి అయ్యే అవకాశం ఉంది.

✦ నైపుణ్యాలు నేర్పించడం వరకే విద్యా సంస్థల బాధ్యత. వంద శాతం ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే.. అది మోసమని గ్రహించాలి.

✦ ఫీజులను అధికారిక పేమెంట్ గేట్‌వే ద్వారానే చెల్లించాలి. వ్యక్తిగత క్యూఆర్ కోడ్‌లు పంపి.. డబ్బు కట్టమంటే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దు.

✦ ఆన్‌లైన్ కోర్సుల్లో చేరేముందు కనీసం 2-3 ఉచిత డెమో తరగతులు చూడండి. ఫీజు కట్టిన తర్వాత తిరిగి చెల్లించే (రీఫండ్) విధానం ఉందో లేదో చూసుకోవాలి.

రెండేళ్ల(2025, 2026)లో ఆన్‌లైన్ మోసాలపై నమోదైన కేసులు

అనంతపురం	శ్రీసత్యసాయి
35	50

అనిశా వలలో పంచాయతీ కార్యదర్శి

రూ.8 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాను చేయాల్సిన పనికి డబ్బు డిమాండ్ చేసి ఓ ప్రభుత్వ ఉద్యోగి అనిశా(ఏసీబీ)కు చిక్కారు. తన కింద ఉద్యోగి ద్వారా లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. అనిశా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. రుద్రంపేట పంచాయతీకి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకున్నారు. ప్లానింగ్ అప్రూవల్ కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా సకాలంలో అనుమతి ఇవ్వకపోగా.. సాకులు చూపుతూ రూ. పదివేలు డిమాండ్ చేశారు. రూ. 8వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న బాధితుడు.. ఆపై లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ హోటల్‌లో బాధితుడి నుంచి పారిశుద్ధ్య కార్మికుడు కంబగిరి ద్వారా పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా లంచం తీసుకుంటూ ఉండగా.. అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కర్నూలు ఏసీబీ కోర్టుకు తరలించారు.

ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, పారిశుద్ధ్య కార్మికుడు కంబగిరి

పుట్టినా ఉలకరు.. కుట్టినా కదలరు!

పురపాలికల్లో పడకేసిన ఫాగింగ్

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నా.. వాటిని అందిపుచ్చుకోవడంలో పట్టణ పాలకులు విఫలమవుతున్నారు. అందుకు నిదర్శనం.. ఎక్కడికక్కడ కాలువలు దోమల ఆవాస కేంద్రాలుగా మారడమే. పోనీ ఫాగింగ్ అయినా సక్రమంగా జరుగుతుందా? అంటే.. అన్నిచోట్లా ఫాగింగ్ యంత్రాలు, ప్రక్రియ అటకెక్కింది. ప్రజలకు కంటి మీద కునుకు కరవైంది. అడపా దడపా చినుకులు రాలుతున్న వేళయినా.. దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

కోవూరునగర్ శివారులో

నగరంలో.. ప్రహసనం

అనంతపురంలో పెద్ద ఫాగింగ్ మిషన్ మూలకు చేరింది. మరో పది చిన్న యంత్రాలు ఉన్నా.. అవి కూడా కొంత సేపటికే వేడెక్కుతుండటంతో ఆపి ఆపి ఫాగింగ్ చేయాల్సి వస్తోంది. దాంతో శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదు. అంబేడ్కర్‌నగర్, మున్నానగర్, ప్రభాకర్ వీధి, రాణినగర్, ఖాజానగర్, కోవూరు నగర్, భాగ్యనగర్, అశోక్‌నగర్, బోయవీధి, ఉమానగర్, ఆజాద్‌నగర్, యువజన కాలనీ, రజకనగర్ తదితర ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉండి.. ప్రజలు అల్లాడిపోతున్నారు.
- న్యూస్‌టుడే, అనంతపురం నగరం

గుంతకల్లులో ఒక్కటే దిక్కు..

గుంతకల్లు పట్టణంలో రెండు యంత్రాలు ఉండగా- ఒకటి మూలకు చేరింది. అయిదు పోర్టబుల్ యంత్రాలు ఉన్నాయంటున్నా.. వాటి ఉనికే లేదు. ఒక్కదానితోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా దిద్దుకొట్టాల, మొదినాబాద్, సిద్ధార్థనగర్, భాగ్యనగర్, పీఅండ్‌టీ కాలనీ, మస్తాన్‌పేట, బెంచికొట్టాల, ప్రశాంతినగర్, పాత గుంతకల్లు తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ జరగడం లేదు. మూలనపడ్డ మిషన్‌కు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని ప్రజారోగ్య పర్యవేక్షకుడు మహబూబ్‌బాషా తెలిపారు. - న్యూస్‌టుడే, గుంతకల్లు

అటకెక్కించారు..

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోనూ ఉన్న నాలుగు పరికరాలు అటకెక్కాయి. 24 వార్డుల్లోని సుమారు 60వేల మంది ప్రజలు దోమల బెడదతో అల్లాడుతున్నారు. దేవీరమ్మ, ఇందిరమ్మ, ఎస్సీ కాలనీలు, శంకరప్పతోట, జయనగర్, ఎర్రనేల వీధిల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

ఆ ఆలోచనే మరిచారు

తాడిపత్రిలో నాలుగు ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. ఏడాదిగా 36 వార్డుల్లో ఫాగింగ్ ఊసే లేదు. చేనేత కాలనీ, జయనగర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, సీపీఐ కాలనీ, పోరాట కాలనీ, గాంధీనగర్, నందలపాడు ప్రాంతాల్లో దోమలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరమ్మతులకు, మరో నాలుగు కొత్తవి కొనేందుకు నిధులు కేటాయించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ దినేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - న్యూస్‌టుడే, తాడిపత్రి

దుర్గంలో బేజారు

కార్యాలయంలో మూలకు చేరిన యంత్రాలు

రాయదుర్గం పురపాలికలో ఒక పెద్ద, మరో రెండు చిన్న యంత్రాలు ఉండగా.. నెల రోజులుగా పాత మున్సిపల్ కార్యాలయంలో పడేశారు. ఫలితంగా 32 వార్డుల్లో ప్రస్తుతం ఫాగింగ్ జరగడం లేదు. 53 చదరపు కి.మీ. విస్తీర్ణం ఉన్న పట్టణానికి మూడు యంత్రాలు సరిపోవడం లేదు. లోతట్టు ప్రాంతాలైన లక్ష్మీబజారు, మధుటాకీస్ ఏరియా, రామస్వామి వీధి, కొలిమి వీధి... డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని రాజీవ్‌గాంధీ కాలనీ, జేఆర్‌ఎస్ కాలనీ, కేబీ ప్యాలెస్ ఏరియా, మేదరు వీధి, పార్వతీనగర్, శాంతినగర్, 10వ వార్డు ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి.
- న్యూస్‌టుడే, రాయదుర్గం

టీటీ.. శ్రీశాన్వి మేటి!

"మూడో తరగతిలో సరదాగా మొదలైన ఆట.. నేడు జాతీయ స్థాయికి ఎదిగితే.. ఓటములను గెలుపు మెట్లుగా మార్చుకుంటూ.. టేబుల్ టెన్నిస్ కోర్టులో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ భళా అనిపించుకుంటోంది అనంతపురం నగరానికి చెందిన పదో తరగతి బాలిక ముంటిమడుగు శ్రీశాన్వి. ఖేలో ఇండియా మేటి క్రీడాకారిణిగా జిల్లాకు పేరు తెస్తోంది."

తల్లిదండ్రుల ఆలోచనే..

శ్రీశాన్వి తండ్రి శంకర్‌నారాయణ హైదరాబాద్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఏజీఎం. తల్లి సునీత సింగనమల జడ్పీ హైస్కూల్‌లో పీడీ. పిల్లలు క్రీడల్లో ఉంటే చదువులోనూ చురుగ్గా ఉంటారని, జీవితాన్ని సానుకూలంగా తీసుకుంటారని వీరిద్దరి నమ్మకం. మూడో తరగతిలో ఉన్నప్పుడే ఆ విషయాన్ని కుమార్తెకు చెబితే.. టేబుల్ టెన్నిస్(టీటీ)ని ఎంచుకుంది.

ఓటమి నుంచి.. స్టేట్ ఫస్ట్‌వైపు

తొలిసారి అండర్-11 రాష్ట్రస్థాయి పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌లోనే వెనుదిరిగిన శ్రీశాన్వి.. ఆ ఓటమితో పట్టుదల పెంచుకుంది. కోచ్ ధనుంజయరెడ్డి మార్గదర్శకత్వంలో అలుపెరుగని సాధనతో.. తర్వాతి టోర్నీలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే ఉత్సాహంతో అండర్-11, 12, 15 విభాగాల్లో వరుసగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

జాతీయ స్వర్ణం..

జాతీయ స్థాయికి వెళ్లినప్పుడు ఆటను ఇంకా మెరుగుపరుచుకోవాలని గ్రహించిన శ్రీశాన్వి.. ఉత్తమ శిక్షణను వెతుక్కుంటూ వెళ్లింది. ఆటలో మెలకువలను ఒడిసిపట్టింది. ఫలితంగా అండర్-13 నేషనల్ డబుల్స్‌లో బంగారు పతకం సొంతమైంది. టీమ్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించడంతో పాటు 'పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు' స్పాన్సర్‌షిప్‌ను దక్కించుకుంది. దిల్లీ వేదికగా.. వారి తరపున ఆటను కొనసాగించింది.

లక్ష్యం.. ఇండియా జెర్సీ

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' స్పాన్సర్‌షిప్‌తో హైదరాబాద్‌లోని 'సోమనాథ్ అల్టిమేట్ టీటీ అకాడమీ'లో శిక్షణ పొందుతున్న ఈ క్రీడాకారిణి.. ఇండియా జెర్సీతో అంతర్జాతీయ వేదికలపై ఆడి.. దేశానికి కీర్తి తేవాలన్నదే తన లక్ష్యమంటోంది.
- ఈనాడు, అనంతపురం

ఓట్లపై 2.87లక్షల అభ్యంతరాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు ఆదివారంతో గడువు ముగియగా- పరిష్కారానికి మొత్తంగా 2.87 లక్షల దరఖాస్తులు దాఖలయ్యాయి. జులై 31న ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత నుంచి వీటిని స్వీకరించారు. కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6, తొలగింపునకు ఫారం-7, చిరునామా మార్పునకు ఫారం-8ను ఆన్‌లైన్, మాన్యువల్‌గానూ స్వీకరించగా.. ఎక్కువగా ఓట్ల తొలగింపునకే రావడం గమనార్హం. వీటన్నిటినీ ఈ నెల 28వతేదీలోపు పరిష్కరించాల్సి ఉంది.

ఓటరును విచారిస్తున్న నగర కమిషనర్ జశంత్‌రావు

ఇదీ సంగతి

దరఖాస్తు	వచ్చినవి	పరిష్కారం	పెండింగ్
ఫాం-6	20,912	3628	17,284
ఫాం-7	2,48,877	2,48,615	262
ఫాం-8	16,881	5,325	11,556

అనంత, గుంతకల్లులోనే ఎక్కువ

ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఓటు నమోదుకు 20,912 మంది దరఖాస్తు చేసుకోగా- ఇప్పటికే 3,628 క్లెయిమ్‌లు పరిష్కరించారు. ఇంకా 17,284 అపరిష్కృతంగా ఉన్నాయి. ఎక్కువగా అనంతలో 3,451, గుంతకల్లులో 3,286 దరఖాస్తులు అందాయి. తక్కువగా ఉరవకొండ, కళ్యాణదుర్గంలో 1500 మాత్రమే అందినట్లు తెలుస్తోంది.

తొలగింపుపైనే అధికం

ఓట్ల తొలగింపు కోసం ఏకంగా 2,48,877 దరఖాస్తులు దాఖలవగా- ఎక్కువగా అనంత అర్బన్‌లోనే 53,968 ఉండటం గమనార్హం. తర్వాత స్థానాల్లో తాడిపత్రి 32 వేలు, గుంతకల్లు, రాయదుర్గంలో 30వేల చొప్పున, రాప్తాడు, శింగనమలలో 28 వేల వంతున, ఉరవకొండ, కళ్యాణదుర్గంలో 22 వేల ప్రకారం ఉన్నాయి. వీటి పరిష్కారం కూడా వేగంగా పూర్తయింది.

అటు ఇటు మార్పు

ఒక ప్రాంతం నుంచి మరో చోటుకు ఓటును బదిలీ చేయాలంటూ 16,881 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే 5,325ను పరిష్కరించగా.. తక్కిన 11,556 పరిశీలన దశలో ఉన్నాయి. ఇందులోనూ అనంత అర్బన్‌లోనే ఎక్కువగా 4వేలు వచ్చాయి. ఆ తర్వాత గుంతకల్లులో 3,794, తాడిపత్రిలో 2253, రాయదుర్గంలో 1722 చొప్పున క్లెయిమ్‌లు అందాయి. కళ్యాణదుర్గంలో 964 వచ్చాయి.

అనంతకు గృహ యోగం

అనంతపురం(అశోక్‌నగర్), న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను ప్రభుత్వాలు సాకారం చేస్తున్నాయి. అందులో భాగంగానే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా అనంతపురం నగరంతో పాటు పలు పురపాలికల్లో తాజాగా 1387 ఇళ్లు మంజూరయ్యాయి. రాష్ట్రంలోనే అనంత జిల్లాలో అత్యధికంగా గృహ నిర్మాణాలు మంజూరు కావడం విశేషం. గత వైకాపా ప్రభుత్వంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం రూ. 1.80 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో ఇంటికి రూ. 2.50 లక్షలు ఇస్తుంది. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అవుతుండటంతో లబ్ధిదారులు ముందుకొస్తున్నారు.

పట్టణం	మంజూరైన ఇళ్లు
అనంతపురం	121
గుత్తి	214
గుంతకల్లు	296
కళ్యాణదుర్గం	87
రాయదుర్గం	486
తాడిపత్రి	183

అర్హులందరికీ ఇళ్లు.. - శైలజ, హౌసింగ్ పీడీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తాం. పట్టణాల్లో పీఎంఏవై అర్బన్ కింద సొంతిళ్లు కావాలనుకొనే వారు స్వర్డ వార్డు కార్యాలయాల్లో లేదా గృహనిర్మాణ సంస్థ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆదమరిస్తే.. అంతే మరి..

అనంతపురం నుంచి కనగానపల్లి మండలం తగరగుంట వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ మార్గంలో రంగంపేట-తోపుదుర్తి గ్రామాల నడుమ పీఏబీఆర్ కాలువపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. అంచునే భారీ గొయ్యి ఏర్పడింది. ఇక్కడ ఎలాంటి రక్షణ గోడలు లేవు. వాహనదారులు ఆదమరిస్తే అగాధంలోకి పడే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఆత్మకూరు

ఒక్కరోజులోనే పరీక్ష ఫలితాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరీక్షల విభాగం నిర్లక్ష్యాన్ని వీడింది. గతానికి భిన్నంగా ఒక్కరోజులోనే పరీక్ష ఫలితాలు విడుదల చేసింది. డిగ్రీ 5వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు ఈ నెల 30న నిర్వహించారు. 231 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాటి మూల్యాంకనం 31న పూర్తిచేసి ఫలితాలను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో 228 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎస్కేయూ వీసీ ఆచార్య జ్యోతి కుమార్, పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య లక్ష్మయ్య చొరవ తీసుకోవడంతో ఫలితాలు విడుదల చేయడంలో రికార్డు సృష్టించారు.

దూసుకొస్తూ... ఉసురుతీస్తూ..

● రహదారులపై వన్యప్రాణుల సంచారం ● బెంబేలెత్తుతున్న వాహనదారులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రహదారులపై కుక్కలు, పశువులు, అడవి పందుల సంచారం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రిళ్లు అకస్మాత్తుగా రహదారిపైకి దూసుకొచ్చే జంతువులను తప్పించే క్రమంలో ఈ తరహా దుర్ఘటనలు చోటు చేసుకోవడం.. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల ఇలా..

✦ ఈ నెల మొదటి వారంలో గుత్తి రోడ్డులో సోములదొడ్డి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటోకు అడ్డుగా ఆవు రావడంతో.. వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. సోములదొడ్డికే చెందిన మహిళ దుర్మరణం చెందారు.

✦ తాజాగా బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి గేట్ వద్ద కారుకు కుక్క అడ్డు రావడంతో.. దాన్ని తప్పించబోయి వాహనం పల్టీలు కొట్టింది. ఈ దుర్ఘటనలో నాగరాజు, రాఘవేంద్ర అనే వ్యక్తులు చనిపోయారు.

ఇక్కడే అధికం...

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అడవి పందుల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా కళ్యాణదుర్గం-కుందుర్పి, బ్రహ్మసముద్రం, కంబదూరు, రాయదుర్గం, గార్లదిన్నె, పామిడి మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఎక్కువ. అడవి పందులు రాత్రిళ్లు ఆహారాన్వేషణకు వాటి స్థావరాలను వదిలి దూర ప్రాంతాలకు వెళుతుంటాయి. ఆపై తెల్లవారుజామున తిరిగి అడవుల్లోకి వెళుతూ.. రహదారులు దాటుతుంటాయి. అటవీ జంతువులు సంచరించే ప్రాంతాల్లో రోడ్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. కొన్నిచోట్ల ఆ మేరకు కనిపించడం లేదు.



తప్పించుకోవచ్చిలా..

అటవీ ప్రాంతాల గుండా వెళ్లేటప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి. వీలైనంత వరకు హైబీమ్ హెడ్‌లైట్లను వాడాలి. ఇవి రోడ్డు పక్కన ఉన్న జంతువులను ముందుగానే గుర్తించడానికి సాయపడుతాయి. జంతువులు రోడ్డుకు అడ్డంగా నిల్చుంటే.. గట్టిగా, నిరంతరాయంగా హారన్ కొట్టి.. క్షణకాలం పాటు లైట్లను డిమ్ చేయాలి.

బ్రాహ్మణపల్లి గేట్ వద్ద బోల్తాపడిన కారు

చెట్నేపల్లి వాగు చెత్తపాలు

గుత్తి పురపాలికలో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ఆటోల ద్వారా సేకరిస్తున్న చెత్తను లచ్చానిపల్లి సమీపంలోని డంపింగ్ యార్డుకు చేర్చకుండా చెట్నేపల్లి వాగులో పడేస్తున్నారు. కొండలా పేరుకున్న తర్వాత నిప్పు పెడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు గుత్తి చెరువులోకి చేరుతున్నాయి. గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో చికెన్ వ్యర్థాలు, గుత్తిలోని గుంతకల్లు రోడ్డులో చెత్త వేస్తున్నారు. ఫలితంగా విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఇకనైనా పురపాలిక అధికారులు స్పందించి చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుత్తి

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

కాసులిస్తే కానిచ్చేస్తారు!

అక్రమ రిజిస్ట్రేషన్లకు దుర్గం అడ్డా

కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థలాలు, భూములు ఎవరివైనా సరే.. అందుకు సంబంధించి దస్త్రాలు సక్రమంగా లేకపోయినా పర్వా లేదు. కాసులిస్తే కళ్లు మూసుకుని పేర్లు మార్పు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తారు.. అది ఎక్కడో కాదు కళ్యాణదుర్గంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే. కాసులిస్తే బతికున్న వారిని మరణించినట్లు, యజమానికి సంబంధించి ఇతరుల పేరు మీద భూములు, స్థలాలు మార్పు చేయడంలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారింది.

అధికారుల తీరు ఇలా..

సబ్‌రిజిస్ట్రార్ 2022లో నరసాపురం భూముల రిజిస్ట్రేషన్ చేయగా సబ్‌రిజిస్ట్రార్ రామ్మోహన్‌నాయుడు అప్పుడు సస్పెండ్ అయ్యారు. సుమారుగా ఒకరు రెగ్యులర్, మిగిలిన ఆరుగురు ఇన్‌ఛార్జీలుగా ఇక్కడ కొన్ని రోజులుకూడా ఉండలేక పోయారు. తరువాత వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి 2025 జులై 24న రూ.5 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. తిరిగి ఇన్‌ఛార్జులే కొనసాగారు. ఇప్పటికీ ఇక్కడ మార్పు రావడం లేదు.

జరిగిన కొన్ని సంఘటనలు..

- ఇటీవలే బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లికి చెందిన బ్రాహ్మణుడికి సంబంధించి 34.05 ఎకరాల భూమికి నకిలీ పత్రాలు సృష్టించారు. భూయజమాని మరణించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని సిద్ధం చేశారు.
- నరసాపురం గ్రామానికి చెందిన సోదరుల మధ్య భూమి తేడాలు వచ్చాయి. ఆయనకు బోయ, కురుబ కులాలకు చెందిన ఇద్దరు కుమార్తెలతో కూడిన వంశ వృక్షాన్ని సిద్ధం చేశారు. ఆ పత్రాలతోనే కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు మార్పుచేసి రిజిస్ట్రేషన్ చేయించారు. కొన్ని రోజులకు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు వెలుగు చూడగా, పోలీసు స్టేషన్‌లో కేసు వేశారు.
- యలగలవంకకు చెందిన ఒకే కుటుంబానికి సంబంధించి భూములు ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్ చేశారు.
- ముద్దినాయనపల్లిలో రైతుల భూమిని ఇతరుల పేరు మీద మార్పు చేశారు.
- ఇటీవలే ఒంటిమిద్ది గ్రామంలో పలువురికి దస్త్రాలు పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ వారి పేర్ల పై మార్పు చేయడం జరిగింది.

సమస్యలు మా దృష్టికి వచ్చాయి

అన్ని ఆధారాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలి. తప్పుడు వాటితో చేయడం సరి కాదు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వాటికి సంబంధించి బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేపడుతున్నాం. నిగ్గుతెలితే తదుపరి చర్యలు తీసుకుంటాం.

-విజయలక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ), అనంత, సత్యసాయి

బంతి పూల సాగు.. లాభాలు బాగు

మార్కెట్‌కు తరలించేందుకు బంతిపూలను సిద్ధం చేస్తున్న కూలీలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లికి చెందిన రైతు సంజీవరెడ్డి బంతిపూలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. స్వల్పకాలిక పంట మంచి దిగుబడితోపాటు ఆదాయాన్ని చేకూరుస్తోంది. ఎకరా విస్తీర్ణంలో సూపర్‌బాల్ రకం విత్తనాలు తెచ్చి సాగు చేశారు. అనంతపురంలో 100 గ్రాముల విత్తన ప్యాకెట్ రూ.1,250 వంతున 12 ప్యాకెట్లకు రూ.15 వేలు, కళ్యాణదుర్గంలోని నర్సరీలో విత్తనాలు నాటించగా ఒక్కో నారుకు 0.40 పైసలు చొప్పున రూ.5,500, సేద్యానికి, కలుపు తీసేందుకు, పురుగు మందులు, కూలీల ఖర్చులు ఇప్పటి వరకు రూ.60 వేలు వ్యయం చేశారు.

85 రోజులకు పంట చేతికొచ్చింది. మొదటి కోతలో 18 క్వింటాళ్లకు రూ.56 వేలు, రెండో కోతలో 16 క్వింటాళ్లకు రూ.50 వేలు చేతికందాయి. ఇంకా మూడు కోతల్లో 40-55 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని రైతు చెప్పారు. వినాయక చవితి పండగకు మంచి ధరలు ఉంటే ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. తోటలోనే కూలీలతో బంతిపూలను సంచుల్లో వేసుకుని వాహనంలో నేరుగా హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ధర ఉండడంతో లాభాలు పొందుతున్నారు.

నష్టాల నుంచి ఊరట

మునగ, మొక్కజొన్న, టమాటా పంటలు సాగు చేస్తే లాభాలు రాలేదు. దీంతో బంతి పూల సాగు చేపట్టాను. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నా. కొన్ని రోజుల్లోనే దిగుబడులు వచ్చాయి. మార్కెట్లో ఆశించిన ధర పలుకడంతో నష్టాల నుంచి గట్టెక్కుతున్నా. **- సంజీవరెడ్డి, రైతు, బోరంపల్లి**

సమస్య-సమాధానం

కిశోర్‌రెడ్డి (శాస్త్రవేత్త, కేవీకే రెడ్డిపల్లి)

సమస్య: మొక్కజొన్న పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. అవి పంటల్లోకి చొరబడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి.

- రెడ్డిపల్లి నరసింహారెడ్డి

సమాధానం: అడవి పందులను చంపడం నేరం. అవి పంటను నాశనం చేయకుండా చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవాలి. పొలం చుట్టూ గుంతలు తవ్వుకున్నా పందులు రావు.

సమస్య: నిమ్మ తోటకు గజ్జి తెగులు వ్యాపించింది. ఎలా నివారించాలి. **- లింగారెడ్డి**

సమాధానం: నిమ్మ తోటలకు వ్యాపించిన గజ్జి తెగులు నివారణకు రైతులు బ్లైటాక్స్ 30 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

దోస పంట.. సిరులే ఇంటా

దోస కాయలను చూపుతున్న రైతు నారాయణరెడ్డి

కదిరి గ్రామీణం, గాండ్లపెంట, న్యూస్‌టుడే: కదిరి నియోజకవర్గంలో రైతులు బోరుబావుల కింద దోస పంటను సాగు చేసి మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు. గాండ్లపెంట మండల పరిధిలోని సోమయాజులపల్లె గ్రామంలో రైతు నారాయణరెడ్డి తన రెండెకరాల పొలంలో దోస పంట సాగు చేశారు. లిట్ అక్మిహల్ అనే విత్తనాలు నాటారు. అధికారుల సూచన మేరకు మందులను సకాలంలో పంటకు అందించారు. ఎకరాకు రూ.70 వేలు పెట్టుబడి పెట్టారు. 60 నుంచి 70 రోజుల కాలవ్యవధి కలిగిన ఈ పంట మొదటి కోతలో దిగుబడి రెండెకరాలకుగాను 20 టన్నులు వచ్చింది. కిలో రూ.20 చొప్పున వ్యాపారికి విక్రయించారు. ఈ లెక్కన పెట్టుబడిపోనూ సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు రైతు చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

నార్ల వద్ద సాగవుతున్న బొప్పాయి పంట

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బొప్పాయి తోటల్లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రధానంగా బొప్పాయి పంటకు ఆశించే కాండంకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లను నివారించడానికి రైతులు బోర్డుమిశ్రమం ఒక శాతం, అలియేట్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. ట్రైకోడెర్మా పొడి 10 గ్రాములు, లీటరు నీటికి కలిపి మొదలు వద్ద పోస్తే అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందని శాస్త్రవేత్త తెలిపారు.

చిట్కా

వక్క.. ఆదాయం పక్కా

జిల్లాలో విస్తరిస్తున్న సాగు

కణేకల్లు మండలం కొత్తపల్లిలో సాగు చేసిన వక్కపంట

కణేకల్లు, న్యూస్‌టుడే: కరవు జిల్లా అనంతపురంలో ఉద్యాన, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటలతో పాటు వక్క సాగుకు అనువుగా మారుతోంది. ఆరేళ్ల నిర్వహించుకుంటే తక్కువ పెట్టుబడితో, కూలీల భారంతో సతమతం కాకుండా అరవై ఏళ్ల పాటు ఆదాయం పొందగల వక్క సాగుకు జిల్లా రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రతికూల పరిస్థితులను అనువుగా మార్చుకొంటుండటంతో జిల్లాలో వక్క సాగు క్రమంగా విస్తరిస్తోంది.

పెట్టుబడి ఖర్చు.. దిగుబడి

సాధారణంగా వక్కసాగుకు తొలి దశలో చల్లటి వాతావరణ పరిస్థితులు అనుకూలం. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నా, ఐదేళ్లపాటు వక్క మొక్క నీడలో పెరిగేలా ఆముదం, మునగ వంటి అంతర పంటలు సాగు చేసుకొంటున్నారు. ఈక్రమంలో ఎకరా వక్క సాగుకు మొదటి ఏడాది రూ.70 వేలు, ఏటా పంట నిర్వహణకు ఎరువులు తదితర ఖర్చులకు రూ.25 వేలు చొప్పున ఖర్చు చేసుకుంటున్నారు. మూడేళ్లకు పూత, పిందెలు కాసి గెలలు ఏర్పడుతాయి. ఐదో ఏటా 3 క్వింటాళ్ల దిగుబడి చేతికందుతుంది. ఆరో ఏట నుంచి ఎకరాకు నికరంగా 6 క్వింటాళ్ల మేర దిగుబడులు చేతికందనున్నట్లు రైతులు చెబుతున్నారు. ఐదేళ్ల వరకు అంతర పంటలతో వచ్చే ఆదాయంతో ఊరట చెందుతున్నారు.

సాగు చేస్తున్నారిలా..

- వక్క సాగుకు వ్యవసాయ బోరులో పుష్కలంగా నీరు ఉండి, బిందు సేద్యం తప్పనిసరిగా ఉండాలి.
- నేల సారవంతంగా ఉండేలా చెరువు ఒండ్రుమట్టితో పాటు సేంద్రియ ఎరువు చల్లి పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.
- కర్ణాటకలోని దావణగెర, శివమొగ్గ ప్రాంతాల్లోని నర్సరీల్లో ఏడాది పాటు పెంచిన చెట్లను రూ.35 వంతున కొనుగోలు చేసి అక్టోబరు, నవంబరు నెలల్లో పొలాల్లో నాటుతున్నారు.
- సాలుకు 9 అడుగులు, మొక్కకు 6 అడుగుల దూరం ఉండేలా ఎకరాకు 700 చెట్ల చొప్పున నాటుతున్నారు. బిందు సేద్యం ద్వార మొక్కకు నీరు అందిస్తున్నారు.
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, అనంతపురం తదితర నియోజకవర్గాల్లో 2 వేల ఎకరాల్లో వక్క సాగు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కేశవ్


అర్జీని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరం రాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించారు. ప్రతి అర్జీదారునితో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన వెల్లడించారు. గడువులోపే ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు.

తాగునీటికి అత్యంత ప్రాధాన్యం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో బోర్లను రీఛార్జ్ చేయడంతో పాటు తాగునీటి అవసరాలను తీర్చడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. సోమవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో హెచ్‌ఎన్‌ఎస్ఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి, కోనాపురం ప్రాంతాల్లో చెరువులను పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. జీడిపల్లి జలాశయం నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ప్యాకేజ్-36ఏ, 36బి ద్వారా ఆయా చెరువులకు నీటిని సరఫరా చేసేందుకు అవకాశాలు సరిచూడాలన్నారు. నరసాపురం, గంగవరం, శ్రీరంగాపురం, కోనంపల్లి చెరువులకు తదుపరి దశలో నీరిచ్చేలా పరిశీలించాలన్నారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. శ్రీవారికి 7 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేక, స్వర్ణకవచ సేవలు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది. రాత్రి ఏడున్నర గంటలకు శ్రీవారికి వెండిరథ ప్రాకారోత్సవం ఉంటుంది.

ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

నవోదయ కాలనీలో క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న సర్ పరిశీలకుడు కిశోర్‌కుమార్, కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తప్పుల్లేని.. పారదర్శకమైన ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా పని చేయాలని 'సర్' రాష్ట్ర పరిశీలకుడు కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సహకారంతో తుది జాబితా పక్కాగా తయారు చేయాలి.. ఇందులో ఏ పొరపాట్లు ఉండకూడదన్నారు. సోమవారం ఆయన సర్ ప్రక్రియపై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఈఆర్‌వో, ఈడీటీలతో సమీక్ష జరిపారు. తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం నగరంలోని నవోదయ కాలనీ, బీకే సముద్రం మండల కేంద్రం పోలింగ్ కేంద్రం 156 పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేసి ఓటర్లతోనూ మాట్లాడారు. సర్ అమలులో అనంత జిల్లా అగ్రభాగాన ఉండేలా పని చేయాలని సూచించారు. సర్ డేటా దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో మాలోల, ఆర్డీవోలు ప్రేమంత్‌కుమార్, వసంతబాబు, ఉప కలెక్టర్లు రామ్మోహన్, రమేశ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కిరణ్మయి, ఈడీటీ కనకరాజు, రాజకీయ ప్రతినిధులు నారాయణస్వామి, నాగభూషణం, బాలరంగయ్య, సోమశేఖర్‌రెడ్డి, ఈరన్న, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

EENADU Classifieds

JOBS

Wanted Experienced Civil Engineers, Supervisors, Accountant for well established Construction Company Cell: 9000677088

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీకు ATPలో పనిచేయుటకు సీనియర్ ఇంజనీర్ 5 to 8 సం||ల అనుభవం మరియు డ్రైవర్ కావలెను. సెల్: 7779992688

నరసింహ హీరో షోరూం అనంతపురం షోరూం నందు జాబ్ చేయుటకు టెలీకాలర్స్, ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్, హెల్పర్స్, వాటర్‌వాష్ హెల్పర్స్ కావలెను. 9951300882

ATP: మా ఆఫీస్ నందు పర్క్ చేయుటకు అకౌంటెంట్, రిసెప్షనిస్ట్, టెలికాలర్, సూపర్‌వైజర్ అర్జెంటుగా కావలెను. 35 Yrsలోపువారు సెల్: 9491555724

FACULTY/ TEACHERS

Wanted Teachers: wanted Qualified and Experienced Teachers for English, Telugu, IIT. Vignan Bharathi Vidyalayam, Bathalapalli. Cell: 9440360616.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

రెవెన్యూ అర్జీలే ఎక్కువ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఎప్పటిలాగే ఈ సోమవారం కూడా ఇతర శాఖల కంటే రెవెన్యూ అర్జీలే సగానికిపైగా రావడం విశేషం. మొత్తం 486 వినతులు రాగా.. ఇందులో రెవెన్యూవే 255 ఉన్నాయి. తక్కిన అన్ని శాఖల అర్జీలు 231 మాత్రమే వచ్చాయి. దీన్నిబట్టి నానాటికి ఆ శాఖలో సమస్యలు పెరుగుతున్నాయి. పరిష్కారం మాత్రం ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సోమవారం రెవెన్యూ భవన్‌లో జేసీ విష్ణుచరణ్, ఉప కలెక్టర్ పద్మావతి, డీసీఓ అరుణకుమారి, సీపీఓ బాలాజీ నాయక్, గృహ నిర్మాణ పీడీ శైలజ, తదితరులు ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ప్రతి అర్జీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ వెంకటరావు

అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే: ఒంగోలు మెటర్నిటీ చైల్డ్ హెల్త్‌లో అనస్తీషియా వైద్యుడిగా పనిచేస్తున్న వెంకటరావుకు పదోన్నతి కల్పించి అనంతపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్)గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వీరపాండ్యన్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన స్థానంలో 15 రోజుల్లోపు చేరాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్ తాడిపత్రి ఏరియా ఆసుపత్రిలో కొనసాగనున్నారు.

స్పర్శ్‌పై అవగాహన, ఫిర్యాదుల పరిష్కారం

తపోవనం (అనంత గ్రామీణం): మాజీ సైనికుల పింఛను సమస్యల పరిష్కారానికి విశాఖపట్టణంలో సెప్టెంబరు 8, 9 తేదీల్లో 202వ రక్షా పింఛను సమాధాన్ ఆయోజన్ (స్పర్శ్)పై అవగాహన, ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రజాక్‌ఖాన్ తెలిపారు. ఫిర్యాదు నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. గూగుల్ ఫారం లింక్ ద్వారా వివరాలు నింపి, ప్రింట్ తీసి సంతకం చేసిన తర్వాత దానికి అవసరమైన పత్రాలను పీడీఎఫ్ చేసి apsparsh07@gmail.com ఈమెయిల్ ఐడీకి పంపాలి. రెండో విధానంలో మాన్యువల్‌గా దరఖాస్తు ఫారమ్ పూరించి సంతకం చేసి పీడీఎఫ్ ద్వారా అదే ఈ మెయిల్‌కు పంపాలి. డిశ్చార్జ్ పుస్తకం, పీపీవో పత్రం, బ్యాంకు పాసుపుస్తకం (మొదటి పేజీ, తాజాగా అప్‌డేట్ చేసిన చివరి రెండు పేజీలు) జత చేయాలి. ఇతర వివరాలకు 94556-91986 నంబరును సంప్రదించాలన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్ అనే యువకుడిపై వేటకొడవళ్లతో దాడి చేసిన నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై నబిరసూల్ తెలిపారు. ఉరవకొండ మండల ముష్టూరు గ్రామానికి చెందిన ఓ బాలికపై అసభ్యకరమైన పోస్టులను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడని ప్రత్యర్థులు వేటకొడవళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పేర్కొన్నారు. దాడి కేసులో మునీంద్ర, నారాయణస్వామి, వన్నూరుస్వామి, ప్రసాద్‌లను గోవిందవాడ క్రాస్ వద్ద అరెస్టు చేసి రెండు వేటకొడవళ్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్షేత్రస్థాయి పర్యటనకు 'అనంత' రైతులు

పర్యటనకు బయలుదేరుతున్న అన్నదాతలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయంలో నైపుణ్యం, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు రైతుల క్షేత్రస్థాయి పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత వైకాపా ప్రభుత్వం క్షేత్రస్థాయి పర్యటనలను పూర్తిగా రద్దు చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. వ్యవసాయ, సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మా) ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు క్షేత్రస్థాయి పర్యటన యాత్రలో భాగంగా సోమవారం ఉదయం అనంతపురం జిల్లా నుంచి 80 మంది రైతులను పంపారు. ఆత్మా డీపీడీ విద్యావతి రెండు బస్సులకు పచ్చజెండా ఊపి సాగనంపారు. 31న బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం, సెప్టెంబరు 1న ఎమ్మిగనూరులో వ్యవసాయ క్షేత్రం, ల్యాబ్‌ల సందర్శన, 2న నంద్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం, 3న మహానంది వ్యవసాయ కళాశాల, వ్యవసాయ, క్షేత్రం, 4న యాగంటి కృషి విజ్ఞాన కేంద్రాన్ని హాలికులు సందర్శించనున్నారు. వీరికి టీం లీడరుగా ఆత్మా వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహ వెళ్లారు.

59 మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు

నియామక పత్రాలు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దాదాపు రెండు నెలల నుంచి ఊరిస్తున్న జడ్పీ కారుణ్య నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం రాత్రి ముగిసింది. ఈ నియామకాల కింద మొత్తం 59 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వివిధ మండలాలను కేటాయించారు. అందులో 24 మందికి జూనియర్ సహాయకులు, అదే సంఖ్యలో టైపిస్టులు, 11 మందికి ఆఫీస్ సబార్డినేటర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఆఫీసు సబార్డినేటర్లు మండల ప్రజాపరిషత్తు కార్యాలయాలకే వెళ్లాలని ఆదేశించారు. జూనియర్ సహాయకులకు కొందరికి జడ్పీ పాఠశాలలకు పోస్టింగ్ ఇచ్చారు. మరికొందరిని జడ్పీ కార్యాలయంలో, పీఆర్ ఇంజినీరింగ్ డివిజన్లలో నియమించారు. 'కారుణ్య నియామకాల్లో కాసుల కక్కుర్తి' అన్న శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి కౌన్సెలింగ్ విధానంలో పోస్టింగ్‌లు ఇచ్చారు. కొందరికి కోరుకున్న చోట పోస్టింగ్ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి, ఉప సీఈవో కృష్ణమూర్తి, ఏవో నియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి 'నా అంగన్‌వాడీ.. నా బాధ్యత'

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా జరిగే రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమంలో భాగంగా ఈనెల 9 నుంచి అక్టోబరు 8 వరకు 'నా అంగన్‌వాడీ.. నా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ సాజిదా బేగం తెలిపారు. జిల్లాలో 11 ప్రాజెక్టుల పరిధిలో 2302 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం జరుగుతుందని వివరించారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఆహార వైవిధ్యం- తగినంత పోషణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడి వంటకాల పంపిణీ, సమాజ భాగస్వామ్యం-జవాబుదారీతనం, పోషణ-చిన్నారుల ప్రాథమిక అభివృద్ధి, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజనపై అన్ని వర్గాల్లో ప్రచారం చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

ఏమార్చి బంగారు ఆభరణాల చోరీ

5 తులాలు ఎత్తుకెళ్లిన తోటి ప్రయాణికురాలు

మాట్లాడుతున్న బాధితురాలు పుష్పలత

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: బస్సులో పక్కనే కూర్చున్న ఓ మహిళ తనను ఏమార్చి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పుష్పలత వాపోయారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. డి.హీరేహాళ్ మండలం లింగమనహళ్లి గ్రామానికి చెందిన పుష్పలత తన పుట్టినిల్లు కణేకల్లుకు వెళ్లింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో కణేకల్లు నుంచి రాయదుర్గం రావడానికి ఆర్టీసీ బస్సు ఎక్కింది. సీట్లు ఖాళీగా ఉన్నప్పటికీ ఓ ప్రయాణికురాలు ఆమె పక్కనే వచ్చి కూర్చొంది. తోటి ప్రయాణికురాలు తన కుమారుడికి పాలు ఇచ్చేందుకు ఓ శాలువాను అడ్డుగా కప్పుకోవడంతో తనకు ఎటువంటి అనుమానం రాలేదు. రాయదుర్గం బస్టాండులో దిగి చేతి సంచిని (హ్యాండ్ బ్యాగ్) పరిశీలించగా బంగారు ఆభరణాలు కనిపించలేదని బాధితురాలు వాపోయింది. రెండు తులాలు మెడ గొలుసు (నెక్లెస్), తనవి, కుమార్తెకు సంబంధించిన కమ్మలు, తన భర్త గొలుసు అన్ని కలిపి 5 తులాల ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని యూపీఎస్ సీఐ దేవానంద్ తెలిపారు. అనంతపురంలో బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసిన రెండు రోజుల్లోనే ఈ ఘటన జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది.

మోసం చేసి.. కార్లను తాకట్టు పెట్టి జల్సా

నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: అధిక బాడుగ ఇప్పిస్తానని వాహన యజమానులకు మాయమాటలు చెప్పి మోసం చేసి ఆ వాహనాలను తాకట్టుపెట్టి జల్సా చేస్తున్న అంకె అమరేశ్వర అలియాస్ హనుమంతును పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉరవకొండలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మహానంది ఎస్ఐ జనార్దన్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌కు చెందిన హనుమంతు అద్దెకు ఇచ్చే కార్ల యజమానుల వద్దకు వెళ్లి అధిక బాడుగ ఆశ చూపి వాహనాలను తీసుకువెళ్లి ఇతరులకు తాకట్టుపెట్టి సులువుగా డబ్బు సంపాదించడానికి అలవాటుపడ్డాడు. సుమారు 13 కార్లను కుదవ పెట్టాడని సీఐ తెలిపారు. మోసపోయిన వాహన యజమానుల్లో ఒక్కరైన ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి కోసం గాలిస్తుండగా మండలం పరిధిలోని పాల్తూరు క్రాస్ వద్ద పట్టుబడినట్లు సీఐ వివరించారు. అతని నుంచి తొమ్మిది కార్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలియజేశారు. మోసాలు చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

పదిమందిపై కేసుల నమోదు

బుక్కరాయసముద్రం, యల్లనూరు, న్యూస్‌టుడే: యల్లనూరు మండలంలోని మేడికుర్తి గ్రామంలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. వివరాలు.. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి 'కార్యకర్తలకు భరోసా యాత్ర' పేరిట మేడికుర్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా తెదేపా గ్రామ నాయకుడు రామకృష్టారెడ్డి తాను ఎదుర్కొంటున్న సమస్య గురించి జేసీకి తెలిపారు. కొన్నాళ్లుగా వైకాపా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డితో తమ ఇళ్ల మధ్యనున్న ముళ్లకంప చెట్లపై వివాదం నెలకొందని, తనకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే జేసీ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ముళ్లకంపలు తొలగించాలని కోరారు. అధికారులు అక్కడికి చేరుకొని వాటిని తొలగిస్తుండగా వైకాపా కార్యకర్తలు అక్కడికి చేరుకొని తెదేపా కార్యకర్తలపై రాళ్లు విసిరారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు కొట్టుకుంటుండగా పోలీసులు చొరవ తీసుకొని అదుపు చేశారు. ఇరువర్గాల్లో నలుగురు గాయపడటంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఇరువర్గాల పరస్పర ఫిర్యాదులతో పోలీసులు వైకాపాకు చెందిన ఆరుగురు, తెదేపా నాయకులు నలుగురిపై కేసులు నమోదు చేశారు. సీఐ సత్యబాబు, ఎస్సై రామాంజనేయులు పరిస్థితిని సమీక్షించారు. అనంతరం జేసీ చిలమకూరు గ్రామానికి వెళ్లి ఇంటింటా ప్రచారం చేస్తుడగా వైకాపాకు చెందిన పెద్దారెడ్డి వర్గీయులు కవ్వింపు చర్యలకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీనిపై ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భరోసా యాత్రను అడ్డుకోవడానికి వైకాపా నాయకులు కుట్రలు చేస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వమన్నారు.

గొలుసు దొంగల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ పుల్లయ్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వృద్ధ మహిళలే లక్ష్యంగా గొలుసు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను రెండో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7.50 లక్షలు విలువజేసే 5 తులాల రెండు బంగారు గొలుసులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ పుల్లయ్య టూటౌన్ పీఎస్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. రాజీవ్‌కాలనీ పంచాయతీలోని గణేనాయక్ కాలనీకి చెందిన షేక్ షాహిద్, మహదేవ్‌నగర్‌కు చెందిన బండారు విజయ్‌కుమార్‌లు చిన్ననాటి మిత్రులు. వీరు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. షాహిద్ ఇంటి నిర్మాణం, తమ్ముళ్ల వివాహాల కోసం అప్పులు చేశాడు. విజయ్‌కుమార్ ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అప్పుల పాలయ్యాడు. తమ అప్పులు తీరాలంటే చోరీలు చేయాలని ఇద్దరు నిర్ణయించుకొని రోడ్లపై ఒంటరిగా నడిచి వెళ్లే వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి, బైక్‌లో ఉడాయించేవారు. ఈ క్రమంలో గత నెల 11న అరవింద్‌నగర్ పార్క్ వద్ద, ఈ నెల 26న ప్రసన్నాయపల్లి రోడ్డులోని అగాపే చర్చి వద్ద మహిళల నుంచి బంగారు గొలుసులను వీరు చోరీ చేశారు. ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులిద్దరినీ నగరంలో అరెస్టు చేసి, జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది.

(c) eenadu

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

శివలింగానికి విశేష అలంకరణ

కంబదూరు, న్యూస్‌టుడే: శ్రావణ సోమవారం స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పురోహితులు క్షీరాభిషేకంతో మొదలు పెట్టి మంత్రోచ్ఛారణల మధ్య బిల్వార్చన చేశారు. స్వామివారిని పూలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పూలు, తమలపాకుల అలంకరణలో శివలింగం

వైభవంగా ఆంజనేయస్వామి ధ్వజారోహణం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: నేమకల్లు గ్రామంలో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా స్వామివారికి ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేకం, అంకురార్పణ పూజలు, విశేషాలంకరణ, హోమం, ఆంజనేయుడికి నవగ్రహ పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేకాలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: శ్రీరంగాపురం క్యాంపులోని ప్రాథమిక పాఠశాల ముందు విద్యుత్తు దీపం లేక అంధకారం నెలకొంది. **-దేవేంద్ర**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం **-శాంతి, కార్యదర్శి, లింగదహళ్**
సమస్య: బొమ్మనహాళ్‌లో విద్యుత్తు లైన్‌మెన్‌ను నియమించాలి **-పయ్యావుల మోహన్‌బాబు**
సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **-లక్ష్మిరెడ్డి, ఏఈఈ, విద్యుత్తు శాఖ**
సమస్య: రాయదుర్గం పట్టణంలోని బీటీపీ ఇందిరమ్మ కాలనీలోని ఆసుపత్రి సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. **-నాగరాజు**
సమాధానం: సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతు చేస్తాం. **-జగన్నాథ్, ఫిట్టర్**
సమస్య: పార్వతి నగర్‌లో మట్టిదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. **-తిమ్మప్ప**
సమాధానం: సీసీ దారులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. **-దివాకర్‌రెడ్డి, పుర కమిషనర్**
-న్యూస్‌టుడే, బొమ్మనహాళ్, రాయదుర్గం పట్టణం

దారులు అధ్వానం
అవస్థల ప్రయాణం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె రోడ్లు పనికిరాకుండా పోయాయి. ఛిద్రమై, రాళ్లు తేలి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు కిందపడి గాయాలపాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

5 కిలోమీటర్లు దారుణం

● కళ్యాణదుర్గం మండలం పింజరి కొట్టాల - నూతిమడుగుకు వెళ్లే 5 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తున్నాయి. అనారోగ్య, ఇతర రాత్రి సమస్యలు వచ్చాయంటే ఇక వారి పరిస్థితి దయనీయం. గోళ్ల - దిగువతండాకు వెళ్లే మార్గం పరిస్థితి దారుణం. అడుగడుగునా గుంతలు, కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగానే ఉంది.

మురడి అంజన్న దర్శనానికి ఎలా వెళ్లేది?

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని పల్లెపల్లి ప్రధాన రహదారి నుంచి మురడికి వెళ్లే 3 కిలోమీటర్ల లింక్ రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు, కంకర తేలి ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. అధికంగా ఈ మార్గంలో వాహనాలు మురడి ఆంజనేయస్వామి ఆలయ దర్శనం నిమిత్తం వెళ్తుంటారు. మారెంపల్లి - కొండాపురం, ఏళ్లంజి -మైలాపురం వెళ్లే రోడ్లు పరిస్థితి ఇదే విధంగా ఉంది.

రాళ్లు తేలిన రహదారి

విడపనకల్లు: విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామం నుంచి పొలాల మధ్యలో కరకముక్కల వరకు 5 కిలోమీటర్ల రహదారి కంకర తేలింది. రైతులు నడవడానికి, వాహనాల్లో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారి గుండా చీకలగురికి కరకముక్కల, హావళిగి మీదుగా కర్ణాటక రాష్ట్రం రూపనగుడి, బళ్లారికి వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం: పలు గ్రామాల్లో కంకర తేలి, గుంతలమయంగా మారిన రోడ్లకు సంబంధించి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం. **- రవీంద్ర, పంచాయతీరాజ్ డీఈ**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని దర్గాహొన్నూరులో ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ సర్పంచి కేశప్ప, కొత్తపల్లి తిమ్మరాజు, రఫీ, ముక్కన్న, బలరామిరెడ్డి, నాగరాజు కుమ్మరి హొన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యమేల?

సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాల్లో జాప్యం

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో మూడు సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసి ఏడాదైనా వాటి నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పట్టణంలో రద్దీ గల ప్రాంతాల్లో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆగిన సామాజిక మరుగుదొడ్డి పనులు

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ముందు, వన్నూరుస్వామి కట్ట వద్ద, శాంతినగర్‌లో నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. వాటిలో ఎంపీడీవో కార్యాలయం ముందు నెల రోజుల క్రితం గోడలు నిర్మించి పైకప్పు వేయలేదు. శానిటేషన్ పిట్స్ కూడా నిర్మించలేదు. యూరినల్స్, మరుగుదొడ్లు నిర్మించలేదు. కనీసం క్యూరింగ్ కూడా సక్రమంగా చేయక వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల ప్రారంభానికే నోచుకోలేదు.

మూడుచోట్లే ఎందుకు: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద మరుగుదొడ్డిని నిర్మిస్తే పట్టణంలోని మున్సిపల్, ఎంపీడీవో, తహసీల్దార్, కోర్టు, పోలీస్ స్టేషన్, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్ కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది, ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. వన్నూరు స్వామి కట్ట వద్ద నిర్మిస్తే బళ్లారి రోడ్డులోని ప్రజలతో పాటు అక్కడి బస్టాండుకు వచ్చే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం బస్టాండుకు వచ్చే మహిళలు ఆరెండు అవసరాలకు చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు వెళుతున్నారు. శాంతినగర్‌లో రోజూ హోల్ సేల్ కూరగాయల మార్కెట్ జరుగుతోంది. ఈమార్కెట్‌కు వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు లేక పోవటంతో బహిరంగ ప్రదేశాలకు వెళుతున్నారు.

త్వరలో ప్రారంభం

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నిర్మిస్తున్న సామాజిక మరుగుదొడ్డికి పైకప్పు వేసి ఇతర పనులు పూర్తి చేయిస్తాం. శాంతినగర్‌లో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద సామాజిక మరుగుదొడ్డిని మరో రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. వన్నూరు స్వామి కట్ట వద్ద నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తాం. **- నరసింహులు, మున్సిపల్ ఏఈ, రాయదుర్గం**

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం చెర్లోపల్లిలో బాధిత కుటుంబానికి కళ్యాణదుర్గం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం రూ.30వేల ఆర్థికసాయంను అందజేశారు. ఇరవైరోజుల క్రితం తండ్రి అనారోగ్యంతో ఆకస్మిక మరణంతో ఇంటికి పెద్దదిక్కును కోల్పోయారు. పెద్దకుమార్తె షేక్ అర్షియా చదవు మధ్యలో ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు స్పందించి చదువు కొనసాగించేందుకు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు వన్నూరుస్వామి రూ.16వేలు, వెంకటేశులు రూ.5వేలు మిగతా మొత్తం ట్రస్ట్ తరపున సహాయం అందించినట్లు వివరించారు. ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండలంలోని వివిధ గ్రామాల్లో మాల సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలకు ఆయా గ్రామాల్లోనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని జిల్లా మాల మహానాడు సంఘం అధ్యక్షుడు కిశోర్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం మండల తహసీల్దార్ ఓబుళేసుకు వినతి పత్రం అందజేశారు.

ఆలయాల వద్ద నిఘా నేత్రాలతోనే భద్రత

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పురాతన, నూతన ఆలయాల వద్ద నిఘానేత్రాలు ఏర్పాటుతోనే భద్రత ఉంటుందని డీఎస్పీ రవిబాబు అన్నారు. సోమవారం స్థానిక పట్టణ సర్కిల్ కార్యాలయంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం సీఐలు హరినాథ్, దేవానంద్‌తో కలిసి ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మూలవిరాట్‌లకు అలంకరించిన ఆభరణాలు, ఇతర విలువైన వాటిని భద్ర పరిచేలా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. నిఘానేత్రాలు ఏర్పాటు చేసుకుంటే ప్రతి విషయాలను తెలుసుకోవచ్చని, చోరీలను అరికట్టేందుకు అవకాశాలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో స్మార్ట్ నిఘా

కెమెరాల వద్ద ఎస్సై ఖాజాహుసేన్

విడపనకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత కఠినతరం చేస్తూ విడపనకల్లు పోలీసుస్టేషన్ పరిధిలోని రెండు కీలక ప్రాంతాల్లో నాలుగు అత్యాధునిక ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలను సోమవారం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు విడపనకల్లు ఎస్సై ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో మ్యాట్రిక్స్ సాంకేతిక బృందం వీటిని అమర్చింది. ఎస్సై మాట్లాడుతూ సరిహద్దు గుండా వెళ్లే ప్రతి వాహనం ఎంట్రీ, ఎగ్జిట్ వివరాలను ఈ కెమెరాలు సెకండ్లలో రికార్డు చేస్తాయని తెలిపారు. నేరాల అదుపునకు, పాత నేరస్థుల కదలికలను కనిపెట్టడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: దర్గాహొన్నూరు గ్రామంలో సోమవారం వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణాల మధ్యన నూతన విగ్రహానికి ప్రత్యేక పూజలు, హోమంలు, నిర్వహించి అనంతరం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొని పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో వాల్మీకి సామాజికవర్గం సోదరులు నడుచుకోవాలని కోరారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు

వర్షం కురవాలని సప్తాహం

విడపనకల్లు, న్యూస్‌టుడే: వర్షం కోసం గ్రామస్థులు 7 రోజుల పాటు సప్తాహం చేపట్టారు. విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో సప్త భజన పూజలను ఘనంగా సోమవారం ప్రారంభించారు. నేటి నుంచి ఏడు రోజుల పాటు రాత్రీ పగలు భజన బృందాలు నిరంతరాయంగా భజనలు చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

భజన చేస్తున్న గ్రామస్థులు

సూచిక బోర్డుకు దిక్కులేదాయే..

కళ్యాణదుర్గం - అనంతపురం వెళ్లే జాతీయ రహదారులు ఎన్‌హెచ్ 544 మార్గంలో ఏర్పాటు చేసిన దిక్సూచి బోర్డు నిరుపయోగంగా రోడ్డు పక్కనే వృథాగా ఉంది. కొత్తవారు ఎలా వెళ్లాలో ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారులు విభాగం జేఈ కుళ్లాయిరెడ్డిని వివరణ కోరగా త్వరలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

ప్రమాదమని తెలిసినా సరిచేయరు..!

బూదగవిలో జాతీయ రహదారి అంచున నివాస గృహాల ముందు విద్యుత్తు స్తంభం ఒకవైపునకు వాలి ప్రమాదకరంగా ఉంది. చాలా రోజులుగా దానికి విద్యుత్తు అధికారులు మరమ్మతులు చేయించ లేదు. పరిసరాల్లో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు శాఖ ఏఈఈ గురుమూర్తిని వివరణ కోరగా స్తంభాన్ని సరి చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, ఉరవకొండ**

పెద్ద వృక్షం.. కూలినా పట్టించుకోరే..!

కంబదూరు అతిథి గృహం ఆవణలో పెద్ద వృక్షం ఆదివారం కూలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఎవరో గుర్తుతెలియని ఆకతాయిల నిప్పు పెట్టడంతో వేర్లతో పాటు కాలి వైఎస్ఆర్ కూడలి వైపు అడ్డంగా పడింది. వీఆర్వో సంజీవ్‌కుమార్‌తో ప్రస్తావించగా ఉన్నతాధికారికి తెలిపి వెంటనే తొలగిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, కంబదూరు**

శిథిలమవుతున్న మురుగు కాలువ

ఉరవకొండలో హోతూరు రహదారి వైపు వెళ్లే ప్రధాన మురుగు కాలువ రక్షణ గోడలు అక్కడక్కడ శిథిలమయ్యాయి. పైగా నివాసగృహాల మధ్యన కాలువలో పూడిక పేరుకుపోయి, మురుగు వేగంగా ముందుకు సాగడం లేదు. దుర్వాసన వస్తోంది. ఎంపీడీవో రవిప్రసాద్‌ను వివరణ కోరగా, పరిశీలించి, చర్యలు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, ఉరవకొండ**

ప్రమాదకర మలుపు.. ఆపై వంతెన

శెట్టూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మచ్చన్నతోట, ఉప్పొంక, మంగంపల్లి యాటకల్లు, అడవిగొల్లపల్లి ఫారెస్టు, శెట్టూరు చెరువుకట్ట, సాయిబాబ గుడి, అయ్యగార్లపల్లి, కర్ణాటక సరిహద్దు గ్రామం తిప్పనపల్లి వరకు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. కనీసం సూచికబోర్డులైనా ఏర్పాటు చేయాలని చోదకులు, స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, శెట్టూరు**

మరమ్మతు చేస్తే ఉపయోగం

ఎనుములదొడ్డి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో చేతి పంపు వృథాగా మారింది. సిబ్బంది, రోగులకు అవసరమైన నీటి కోసం గతంలో ఏర్పాటు చేసిన చేతి పంపు ఏడాదిగా పనిచేయడం లేదు. మరమ్మతులు చేయించక వృథాగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతు చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, కుందుర్పి**

తాగునీటికి సచివాలయం ముట్టడి

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరులో 10 రోజులుగా చాలా కాలనీలకు తాగునీరు రావడం లేదంటూ మహిళలు సచివాలయాన్ని ముట్టడించారు. పాల్తూరులో దూదేకుల కాలనీ, జంగమ వీధి, బావిగడ్డ వీధి, ఎస్సీ కాలనీలలో సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ విద్యుత్తు స్తంభాలు కొత్తవి వేస్తున్నారని ఆ పనులు చేస్తున్నప్పుడు గ్రామంలో మూడు చోట్ల సుంకలమ్మ ఆలయం వద్ద, ఎంపీపీ పాఠశాల వద్ద, హావళిగి రహదారి వద్ద పైపులు పగిలిపోవడంతో తాగునీటి సరఫరా ఆలస్యం అవుతుందన్నారు. ఇప్పటికే రెండు చోట్ల పైపులను వేశామన్నారు. త్వరతిగతిన పనులు పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో 50శాతం కూడా సాధారణ పంటలు సాగు కాక పోవడంతో ప్రభుత్వం రాయితీపై రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలను అందించే దిశగా చర్యలు చేపట్టిందని కూడేరు మండల వ్యవసాయాధికారి శుభకర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలానికి ఉలవ విత్తనాన్ని సరఫరా చేసిందన్నారు. సోమవారం వాటిని మండలంలోని తిమ్మాపురంలో ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఉలవ క్వింటా రూ.7,400 కాగా 80శాతం రాయితీ పోగా రైతు రూ.1480 చెల్లించాల్సి ఉందన్నారు. రైతు సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు పది కిలోలు కలిగిన ఒక సంచి విత్తనాన్ని రూ.148కి అందించనున్నట్లు వివరించారు.

చెరువుకు నీటిని విడుదల చేయాలని రాస్తారోకో

వజ్రకరూరు, ఉరవకొండ, న్యూస్‌టుడే: హంద్రీనీవా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద నుంచి రామగిరి చెరువుకు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం సాయంత్రం ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిలోని రాగులపాడు సమీపంలో రాస్తారోకో చేశారు. చెరువుకు నీటిని విడుదల చేయడం ద్వారా తమ పొలాల్లోని బోర్లలో నీటి లభ్యత పెరగడంతో పాటు, ఆ నీటిని పంటలకు వినియోగించడానికి ఆస్కారం ఉందన్నారు. ఆందోళనతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న సీఐ మహానంది, ఎస్ఐ నాగస్వామి ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

రోడ్డుపై బైఠాయించిన రైతులు

వ్యాయామ ఉపాధ్యాయురాలిని కావాలని

మాది మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులు పార్వతి, చంద్రశేఖర్ వ్యసాయం చేస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో గత ఏడాది ఏలూరు, తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి కాంస్య పతకాన్ని సాధించాను. తాజాగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-17 53 కిలోల విభాగంలో ప్రతిభను చాటి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. భవిష్యత్తులో చదువుతో పాటు, క్రీడల్లో రాణించి వ్యాయామ ఉపాధ్యాయురాలిని కావాలన్నదే లక్ష్యం. **- నిహారిక, పదో తరగతి**

జాతీయస్థాయిలో రాణించాలని..

మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు యల్లమ్మ, యల్లప్ప. వారు కష్ట పడుతూ నన్ను చదివిస్తున్నారు. వాలీబాల్ క్రీడలో సాధన చేస్తున్నాను. గత ఏడాది బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో, తాజాగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ రాణించాను. వ్యాయామ ఉపాధ్యాయుడు నేర్పిన మెలకువలతో జట్టు విజయానికి కృషి చేశాను. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నది లక్ష్యం. **- లలిత, తొమ్మిదో తరగతి**

గ్రామీణ పిల్లలు.. ఆటల్లో ఆణిముత్యాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: వారు సాధారణ కుటుంబాలకు చెందిన పిల్లలు. తమ స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఇస్తున్న క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. వారే ఉరవకొండ మండలం బూదగవి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయా తరగతులు చదువుతున్న నిహారిక, లలిత, భరత్, అనిల్. వారు హెచ్ఎం భాస్కర రెడ్డి పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ శిక్షణలో వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. తాజాగా జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ ప్రతిభ చాటి, ప్రశంసా పత్రాలను సొంతం చేసుకున్నారు.

సైనికుడు కావాలన్నదే లక్ష్యం - భరత్, పదో తరగతి

మాది సామాన్య వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు అరుణ, బాలకృష్ణ. వారి ప్రోత్సాహంతో చదువుతో పాటు వెయిట్‌లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నాను. గత ఏడాది గుంటూరులో జరిగిన పోటీల్లో కాంస్య పతకం లభించింది. తాజాగా తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-17 52 కిలోల విభాగంలో పాల్గొని ప్రతిభ చాటాను. హ్యాండ్ బాల్ పోటీల్లోనూ పాల్గొంటున్నాను. భవిష్యత్తులో సైనికుడిగా దేశ సేవలో భాగస్వామిని కావాలన్నదే లక్ష్యం.

ఉన్నత ఉద్యోగంపై దృష్టి - అనిల్, తొమ్మిదో తరగతి



మాది మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులు గంగాధర్, సునీత వ్యవసాయం చేస్తుంటారు. నేను వాలీ బాల్ క్రీడలో రాణిస్తున్నాను. తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని, జట్టులోని మిగతా క్రీడాకారులతో పాటు రాణించాను. భవిష్యత్తులో ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలన్నదే లక్ష్యం.

విధుల్లో కుప్పకూలి.. అటెండర్ మృతి

కణేకల్లు, న్యూస్‌టుడే : స్థానిక ఆదర్శ పాఠశాలలో పొరుగు సేవల కింద అటెండర్‌గా పని చేస్తూ కళ్యాణదుర్గం నుంచి రాకపోకలు సాగిస్తున్న శ్రీనివాసులు(55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయమే విధులకు హాజరైన ఆయన ఛాతిలో నొప్పిగా ఉందంటూ మెడికల్ గదిలో కాసేపు సేదదీరి బయటకు వచ్చే క్రమంలో తలుపు వద్ద కుప్పకూలి పడిపోయాడు. గమనించిన సిబ్బంది, ప్రిన్సిపల్ రెహనాబేగం హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

3న ఉపాధ్యాయుల చలో విజయవాడ

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు రామప్ప చౌదరి, జిల్లా కార్యదర్శులు శేఖర్, సంజీవకుమార్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 3న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ, కరపత్రాలను సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు.

నిరవధిక ధర్నాను విజయవంతం చేయండి

రాయదుర్గం పట్టణం: విజయవాడలో సెప్టెంబరు 2 నుంచి 12వ తేదీ వరకు నరవధిక ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు.

శ్మశానానికి భూమి కేటాయింపుపై హర్షం

కణేకల్లు, న్యూస్‌టుడే : అంతిమ సంస్కారాలకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న తుంబిగనూరు గ్రామంలో శ్మశానానికి ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే నెం.144బిలో 2.6ఎకరాలు కేటాయించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్య గ్రామస్థులకు అందజేశారు.

ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను విడుదల చేసి, అన్ని గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ బూత్ స్టేషన్లలో ప్రచురణ చేసినట్లు ఎంపీడీవో దాసనాయక్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా విడుదల చేస్తూ గోడలకు నోటీసులను అంటించారు.

గురుకుల పాఠశాలకు డెస్కుల వితరణ

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కణేకల్లు క్రాసింగ్ గురుకుల పాఠశాలకు విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేయూత అందించింది. విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా రూ.1.13లక్షల విలువైన 26 డెస్కులను సోమవారం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి కూడేరు ప్రభుత్వ పశువైద్యశాల వైద్యుడు శ్రీనివాస్ చొరవ తీసుకొని డెస్కులు వితరణకు కృషి చేయడం, విర్బాక్ సంస్థ ఏరియా మేనేజర్ రవికుమార్, ప్రతినిధి తిరుపాల్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపల్ వెంకటనాయుడు, బోధనా సిబ్బంది కొనియాడారు.

డెస్కులను ప్రారంభిస్తున్న దాతలు

ఆవులదట్ల పాఠశాలకు 15 బెంచీలు

రాయదుర్గం గ్రామీణం: ఆవులదట్లతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామ ప్రత్యేకాధికారి డి.సూర్యనారాయణ రెడ్డి, ఆవులదట్ల పశు వైద్యాధికారి డా. శిరీష మార్గదర్శకత్వంలో అదే సంస్థ రూ.60 వేల విలువ చేసే 15 బెంచీలను సోమవారం అందజేసింది.

(c) eenadu

శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వరూ..

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే శ్రావణిశ్రీ కోరారు. ఆమె సోమవారం అనంతపురంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలు, పలు పనులకు సంబంధించి గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లు బకాయిలు విడుదల చేయాలని విన్నవించారు. ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. తాగునీటి సమస్యలు తీర్చేందుకు నిధులు కావాలని కోరారు. హెచ్చెల్సీ కాలవ ఆధునికీకరణ, వంతెనల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి అవసరాలకు హెచ్చెల్సీ, హంద్రీనీవా నీటిని చెరువులకు నింపాలన్నారు. తమ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే శ్రావణి వెల్లడించారు.

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

మెరుగైన విద్య ప్రభుత్వ ధ్యేయం

అన్నం పరిశీలిస్తున్న ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కేజీబీవీలో చదివే బాలికలకు మెరుగైన విద్యా బోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప తెలిపారు. ఆయన సోమవారం గార్లదిన్నెలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో పాటు రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యా ప్రమాణాలను పెంచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో బాలికలు ముందుకు సాగేలా ప్రోత్సాహం అందించాలన్నారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నాగసత్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: పట్టణంలోని హనుమేశ్ నగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు దగ్గర రహదారి పక్కన చెత్తాచెదారం తొలగించడం లేదు. దోమలు ఎక్కువై ఇబ్బందిగా ఉంది. **- ఎల్లప్ప, స్థానికుడు**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
- రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (1, 2 డివిజన్)

సమస్య: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు పడటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. **- నరసింహులు, చోదకుడు**

సమాధానం: త్వరలోనే గుంతలను పూడ్చి వేయిస్తాం. -హరికృష్ణ, పురపాలిక ఏఈ
-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: మండలంలోని పి.కొత్తపల్లి నుంచి కొప్పలకొండకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన చేతిపంపు పాడైంది. వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలి. **- రాము, గ్రామస్థుడు**

సమాధానం: త్వరలోనే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం.
- లక్ష్మణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గార్లదిన్నె
-న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

సమస్య: తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు కూడలిలో మార్గబిలం వద్ద వ్యర్థాలు పడేశారు. ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. **-మనోజ్‌కుమార్, వాహనచోదకుడు**

సమస్య: పట్టణంలోని ఆశా ఆసుపత్రి ఎదురుగానున్న టీ దుకాణం వద్ద పురపాలిక తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. నీరు భారీగా వృథా అవుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-రామాంజనేయులు, స్థానికుడు**

సమాధానం: యల్లనూరు రోడ్డు కూడలిలో వ్యర్థాలు తొలగిస్తాం. తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపడతాం.
- తేజ, మున్సిపల్ ఏఈ -న్యూస్‌టుడే, తాడిపత్రి

గుత్తిలో చెత్త తిప్పలు
కుండీలు లేవు, వాహనాలు రావు

గుత్తిలోని ఓ వీధిలో తుప్పుపట్టిన చెత్తకుండీ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పట్టణ పురపాలిక చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇంటింటా వ్యర్థాల సేకరణ వాహనాల కొరత నెలకొంది. కుండీలు లేవు. కొత్తవి ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అనుమతించడం లేదు. మరోవైపు రోడ్లపై నిండిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నా వాహనాల కొరతే. ఫలితంగా ప్రధాన రహదారులు, కూడళ్లు అపరిశుభ్రంగా మారాయి. గుత్తి, గుత్తి ఆర్ఎస్‌తో పాటు సూరశింగనపల్లిలో ఇంటింటా చెత్త సేకరణ సజావుగా సాగడం లేదు. ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆటోలు ఇస్తామని చెబుతూ వచ్చింది. పురపాలికకు 14 ఆటోలు సమకూర్చుతామని ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. గుంతకల్లు, తాడిపత్రి పట్టణాలకు ప్రభుత్వం గతంలోనే ఆటోలను సమకూర్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పట్టణ పురపాలిక పరిధిలో మూడు ఆటోలుండగా ఒకటే పనిచేస్తోంది. మిగిలిన రెండు మూలన పడ్డాయి. నాలుగు ట్రాక్టర్లుండగా ట్రాలీలు తుప్పుపట్టి రంధ్రాలు పడ్డాయి. వ్యర్థాలను తరలించేటప్పుడు రంధ్రాల నుంచి దారి పొడవునా పడిపోతున్నాయి.

కాలువలు, రోడ్లపైనే..

చెత్త కుండీలు లేకపోవడంతో పట్టణవాసులు రోడ్లపై, మురుగు కాలువల్లో వ్యర్థాలను పడేస్తున్నారు. ఫలితంగా మురుగు ముందుకు కదలక రహదారులపై ప్రవహిస్తోంది. పలు కాలనీల్లో మురుగు ఇళ్ల ముందే నిలిచిపోతుండటంతో భరించలేని దుర్వాసనకు తోడు దోమల విజృంభణకు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పురపాలిక అధికారులు రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మైకుల్లో ప్రచారం చేస్తున్నారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. చెత్తకుండీలు లేక, సేకరణ వాహనాలు రాక, ఆటోలకు మరమ్మతులు చేయక మాపై జరిమానాలు వేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరెడ్డిని న్యూస్‌టుడే వివరణ కోరగా స్పందించారు. సమస్య ఉన్న మాట నిజమేనని, కొత్త ఆటోలకు గతంలోనే ప్రతిపాదనలు పంపామన్నారు. అవి వస్తే సమస్య తీరుతుందన్నారు.

విద్యా రంగాన్ని బలోపేతం చేయండి

ప్రదర్శనగా వస్తున్న విద్యార్థులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గం కార్యదర్శి వినోద్ సర్కారును డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు సోమవారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం చేరుకొని ధర్నా చేశారు. అనంతరం మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, పీజీ విద్యార్థులకు గుదిబండగా మారిన జీవో నంబర్ 77ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే తీర్చాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి నాగభూషణంకు అందజేశారు.

మామపై వేటకొడవలితో అల్లుడి దాడి

ఆసుపత్రిలో బాధితుడు పాముల రాజా

నార్పల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తిక్కయ్యస్వామి వీధిలో కుటుంబ కలహాల నేపథ్యంలో వేటకొడవలితో అల్లుడు మామపై దాడి చేసిన ఘటన సోమవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. వీధిలో నుంచి నివాసం ఉంటున్న చలమకూరి పాముల రాజాకు ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్న కూతురు రమాదేవికి 18 నెలల క్రితం లింగాల మండలానికి చెందిన శివయ్య కుమారుడు చరణ్‌తో వివాహం చేశారు. ఆమె గర్భవతి కావడంతో ప్రసవానికి పాముల రాజా తన ఇంటికి తీసుకొచ్చారు. నెల రోజుల క్రితం ఆమె ప్రసవించింది. బిడ్డను చూసేందుకు వచ్చిన చరణ్ అకస్మాత్తుగా మామపై వేటకొడవలితో దాడి చేశాడు. రాజా కుడిచేతి మణికట్టుపై నరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. దాడి తప్పించుకునేందుకు రాజా బయటకు పరుగులు తీయగా చరణ్ వెంటపడ్డాడు. స్పందించిన స్థానికులు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా సాగునీటి కాలువ ఆధునికీకరణ

చాగల్లు జలాశయం కుడి కాలువలో తొలగిన ముళ్లకంప, పూడిక

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని చాగల్లు జలాశయం కుడి కాలువ ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నీటి వృథా అరికట్టి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సొంత నిధులతో ఈ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చాగల్లు జలాశయం నుంచి తాడిపత్రి మండలం కోమలి వరకు 15 కిలోమీటర్ల మేర కాలువలో ముళ్లచెట్లు, పూడికను యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలువ రూపురేఖలు మారిపోయాయని, ప్రస్తుతం జరుగుతున్న పనులతో తమ పంటలకు నీరందుతుందని పెద్దపప్పూరు, తాడిపత్రి మండల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కులవివక్ష రహిత సమాజమే లక్ష్యం

పెద్దవడుగూరు..గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: కులవివక్ష లేని సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దారు ఉషారాణి, ఎస్సై రాఘవేంద్రప్ప తెలిపారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని మిడుతూరు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. అన్ని కులాలు, వర్గాలు, మతాలకు చెందిన వారు సోదరభావంతో మెలగాలన్నారు. అంటరానితనం నేరమని..నేటికీ కొన్ని గ్రామాల్లో ఈ దురాచారం కనిపించడం బాధాకరమన్నారు. గ్రామీణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్తు సమస్యలను గ్రామీణులు అధికారుల దృష్టికి తేగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సదస్సులో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు ఆంజనేయులు, అంజి, వసతిగృహ వార్డెన్ ఉమాదేవి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలిద్దామని తహసీల్దారు శ్రీధరమూర్తి, ఎస్సై ఆంజనేయులు పిలుపునిచ్చారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా దండువారిపల్లి గ్రామంలో వారు పర్యటించి గ్రామీణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దళితులపై వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు ఇచ్చిందన్నారు. అనంతరం గ్రామస్థులు సమస్యలు తెలిపారు. శ్మశానవాటిక కేటాయించాలని, రోడ్లు నిర్మించాలని, విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్ రాజు, ఆర్ఐ ప్రశాంత్, వార్డెన్ బాబు పాల్గొన్నారు.

మడుగు.. ఎలా వెళ్లాలో అడుగు

వర్షం కురిసిన ప్రతిసారీ సోదనపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా మారుతోంది. భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటిలో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు, వాహనచోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నార్పల**

రక్షణ గోడలు లేని బావులు

మండల పరిధి ముచ్చుకుంటపల్లి గ్రామంలోని మూడు బావులకు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వీటి మధ్య నుంచి నిత్యం పిల్లలు రాకపోకలు సాగిస్తుంటారని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందులో పడిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటి చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, నార్పల

మురుగు కాలువ పూర్తిచేయరూ..

పట్టణంలోని అంబేడ్కర్ నగర్ నుంచి బస్టాండు వరకు వెళ్లే ప్రధాన కాలువ నిర్మాణం ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించినా గుత్తేదారు సగంలోనే పనులు ఆపేసి వెళ్లిపోయారు. మరోవైపు నాసిరకం పనులతో ప్రధాన రహదారి వద్ద కాలువ ధ్వంసమైంది. ప్రస్తుతం బ్యారికేడ్లు, బండలు అడ్డం పెట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువను పూర్తిగా నిర్మించాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

బాధిత కుటుంబానికి ప్రమాద బీమా అందజేత

పామిడి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన తెదేపా కార్యకర్త శ్రీపురం మురళి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి రూ.5లక్షల ప్రమాద బీమా పత్రాన్ని మృతుడి కుటుంబ సభ్యురాలు నిర్మలకు తెదేపా నాయకులు సోమవారం అందజేసి మాట్లాడారు. మురళి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, ఆయన అకాల మరణం తమకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహనకృష్ణ, శ్రీనివాసరెడ్డి, సంజీవకుమార్, కుమార్, రాజు, సుంకప్ప, రాము, శివ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

2న క్రికెట్ శిక్షణకు బాలికల ఎంపిక

గుంతకల్లు, న్యూస్‌టుడే: గ్రామీణ మండలంలోని బాలికలకు క్రికెట్ శిక్షణకు ఎంపిక పోటీలను ఆర్డీటీ ఆధ్వర్యంలో 2న రైల్వే క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ శిక్షకులు గులాం ఖాదిర్‌బాషా, ఇనాయతుల్లా సోమవారం తెలిపారు. అండర్-15, అండర్-18 విభాగంలో ఈ పోటీలుంటాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలు పాల్గొనవచ్చని వెల్లడించారు. ఎంపికైన వారికి ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. పోటీలు ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని వారు వివరించారు.

కార్యకర్తలే తెదేపా బలం

సీనియర్ కార్యకర్తను పరామర్శిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

యల్లనూరు, న్యూస్‌టుడే: కార్యకర్తలు తమకు దేవుళ్లతో సమానమని, వారే పార్టీకి బలమని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలకు భరోసా యాత్రలో భాగంగా ఆయన సోమవారం మండలంలోని వేములపల్లి, నిట్టూరు, మల్లేపల్లి, కొడిమూర్తి, కొండాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. సీనియర్ కార్యకర్తలను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు ప్రసాద్ రెడ్డి, మోహన్, రవి, రాజేష్‌రెడ్డి, రత్నమయ్య, రాముడు, యోగా, పాపారాయుడు తదితరులున్నారు.

మనస్తాపంతో కార్మికుడి ఆత్మహత్య

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: పెళ్లి కాలేదన్న మనస్తాపంతో కార్మికుడు శ్రీనివాసులు(40) సోమవారం మధ్యాహ్నం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని హనుమేశ్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు ఆలూరు రోడ్డు పక్కనున్న హోటల్‌లో పని చేస్తున్నాడు. తనకు ఇంకా పెళ్లి కావడం లేదని బాధపడేవాడు. ఈ నేపథ్యంలో రోటరీ స్కూల్ దగ్గరనున్న రైల్వే ట్రాక్‌పై గూడ్సు బండి కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

విషం తాగి బాలిక బలవన్మరణం

పుట్లూరు (యల్లనూరు), న్యూస్‌టుడే: పుట్లూరు మండలం తక్కలపల్లికి చెందిన బాలిక వాసవి(16) విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన రామాంజనేయులు, అనంతమ్మ దంపతుల కుమార్తె వాసవి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించిన రోగం నయం కాకపోవడంతో గత నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక విష ద్రావకం తాగింది. తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్రబాబు తెలిపారు.

గొడవపడిన ఎనిమిది మంది బైండోవర్

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో ఇటీవల గొడవకు పాల్పడిన ఎనిమిది మందిని తహసీల్దార్ రవిచంద్ర ముందు బైండోవర్ చేసినట్లు గ్రామీణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ముందస్తుగా వారిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. గ్రామస్థులు రాజేష్, కామేశ్వరరెడ్డి, ఓబులేసు, అరుణ్‌కుమార్, సుధీర్, రాజశేఖర్, కుమార్, హర్షవర్ధన్ నుంచి ఏడాది పాటు రూ.5లక్షలకు బాండ్లు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

రెండిళ్లలో బంగారు నగల చోరీ

గుత్తి: గుత్తి, ఊబిచర్లలోని రెండిళ్లలో బంగారు నగలు చోరీకి గురైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గుత్తిలోని కేపీఎస్ వెంచర్‌లో ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో అర తులం కమ్మలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఊబిచర్ల గ్రామానికి చెందిన గోవిందు ఇంటిలో ఎనిమిది తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్ల పేరిట మోసంపై ఫిర్యాదు

తాడిపత్రి: ప్లాట్ల పేరిట మోసానికి పాల్పడ్డారంటూ తాడిపత్రి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. వివరాలు.. గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వెంకటనారాయణ అనే వ్యక్తి వెంకటరమణ వద్ద నుంచి 20 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశారు. అప్పటినుంచి తమ స్థలాలు చూపించకుండా వెంకటరమణ వాయిదా వేస్తున్నట్లు బాధితుడు వాపోయారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చక్కటి పనితీరుతోనే మంచి పేరు

గుంతకల్లు: సత్కారం అందుకున్న రవిప్రకాశ్ నాయుడు దంపతులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: పట్టణ పురపాలికలో డీఈగా పనిచేస్తున్న రవిప్రకాశ్ నాయుడు సోమవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురపాలిక కమిషనర్ లక్ష్మీదేవి, తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి మాట్లాడారు. అంకితభావంతో పనిచేసే వారికి ప్రజల్లో ఎప్పటికీ మంచి పేరు ఉంటుందన్నారు. డీఈ తన విధులను చక్కగా నిర్వర్తించారని, ఎన్నో సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. అనంతరం రవిప్రకాశ్‌నాయుడు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణారెడ్డి, మెప్మా అధికారి మోహన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎర్రిస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండలంలోని పి.బండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలందించిన కె.వి.శేషగిరిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు ఘన వీడ్కోలు పలికారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శేషగిరిరావు దంపతులను సత్కరించారు. ఆయన తన బోధనతో విద్యార్థులను ఆకట్టుకున్నారని, వారి వృద్ధికి దోహదం చేశారని పలువురు కొనియాడారు.

గుత్తి: గుత్తి పురపాలిక కమిషనర్ జబ్బార్‌మియా, పంచాయతీరాజ్ డీఈఈ మురళీధర్‌ల ఉద్యోగ విరమణ సందర్భంగా తోటి ఉద్యోగులు, అధికారులు ఘనంగా సన్మానించారు. తొలుత కమిషనర్‌ను పురపాలిక కార్యాలయం నుంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. పీఆర్ డీఈఈ మురళీధర్‌ను గుత్తి, పామిడి, గుంతకల్లు ఏఈఈలు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

హెచ్చెల్సీ ప్రధాన కాలవకు నీరివ్వండి సారూ..

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి తీర్చేందుకు హెచ్చెల్సీ ప్రధాన కాలవకు వెంటనే నీరు విడుదల చేయాలని తెదేపా నాయకులు అగ్రహారం రాము, రామయ్య హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం వారు ఆయనను కలుసుకొని తమ సమస్యలను విన్నవించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం, అగ్రహారం, చెన్నంపల్లి, సంజీవపురం, రేకులకుంట గ్రామాల్లోని బోర్లలో నీరు అడుగంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణులతో పాటు పశువుల గొంతులు ఎండిపోతున్నాయని వాపోయారు. ప్రధాన కాలవకు నీరు వదిలితే బోర్లు రీఛార్జ్ అవుతాయని విన్నవించారు. స్పందించిన ఎస్ఈ పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గుత్తి.. గోడు వినేదెవరు?

గుత్తి మున్సిపాలిటీలో ఒక్క యంత్రమే పని చేస్తుండగా- రెండు మూలకు చేరాయి. కోట, బీసీ కాలనీ, బండగేరి, పైమాలవాడ, గుత్తి ఆర్.ఎస్., గాంధీనగర్, చెర్లోపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు కొరవడ్డాయి. హోరబ్ చర్చి, బండిమోటు వీధి, గుత్తిలోని దళితవాడ, కురవగేరి, జెండాగేరి, చెర్లోపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. **- న్యూస్‌టుడే, గుత్తి**

పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 25 పంచాయతీల్లో నిర్వహించే ఎన్నికల పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం అధికారులు ఆవిష్కరించారు. మొత్తం 230 పోలింగ్ కేంద్రాలు తేలాయి.

గార్లదిన్నె: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కలెక్టర్ ఆమోదం పొందిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఇన్‌ఛార్జి ఎంపీడీవో బాబా ఫక్రుద్దీన్ విడుదల చేశారు. మండలవ్యాప్తంగా 18 పంచాయతీల్లో 190 కేంద్రాలను తేల్చారు.

శ్మశానవాటికలను కాపాడండి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని తమ శ్మశానవాటికను కొందరు ఆక్రమించుకున్నారని, వారి నుంచి విడిపించాలంటూ ముస్లిం సోదరులు సోమవారం తహసీల్దారు ఉషారాణికి విన్నవించారు. సర్వే నంబరు 484లో 2.85 ఎకరాల విస్తీర్ణంలోని మరుభూమిలో 19 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని వాపోయారు. స్పందించిన తహసీల్దారు రెండు రోజుల్లో కొలతలు వేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వృద్ధురాలి బంగారు గొలుసు మాయం

తాడిపత్రి, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం గన్నెవారిపల్లి కాలనీలో నిద్రిస్తున్న వృద్ధురాలి బంగారు గొలుసు చోరీకి గురైంది. కాలనీలో ఉంటున్న ఓబులేసు, లక్ష్మీదేవి దంపతులు ఆదివారం ఇంటి ముందు నిద్రించారు. వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు లక్ష్మీదేవి తలగడ కింద ఉంచిన బంగారు గొలుసు సంచి తీసుకొని పారిపోయారు. ఆమె తన మెడలోని బంగారు తాళిబొట్టు గొలుసు తెగిపోవడంతో తలకింద పెట్టుకుని నిద్రించారని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సంచార జాతులకు న్యాయం చేయాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లవుతున్నా సంచార జాతులు విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నాయని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో సోమవారం విముక్తి దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప మాట్లాడారు. నేటికి తమ జాతులకు చెందిన కొందరు గుడారాల్లో నివసిస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు తమ దరికి చేరడం లేదని ఆరోపించారు. అనంతరం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

తెరవరు.. నడిపించరు.. బతుకునివ్వరు

మూతబడిన ట్యానింగ్ సెంటర్

గుంతకల్లు, న్యూస్‌టుడే: పట్టణ పురపాలిక పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ప్రభుత్వ పరిశ్రమలు చాలా కాలం క్రితమే మూతబడినా సర్కారులు పట్టించుకోవడం లేదు. వాటిని తిరిగి వినియోగంలోకి తెస్తే ఎంతోమంది జీవితాలు బాగుపడతాయి. గుంతకల్లు ప్రాంతం అభివృద్ధి చెందేందుకు అవకాశమున్న సంస్థలను పునరుద్ధరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు, నిరుద్యోగులు కోరుతున్నారు.

పరిశ్రమల మూతతో అవస్థలు

ఎక్కడెక్కడ..ఏవేవీ అంటే.

- దాదాపు 1400 మందికి ఉపాధిని అందించే ఆంధ్రా సహకార నూలుమిల్లు 20 ఏళ్ల క్రితం మూతపడింది. ఇందులో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు చెబుతూ వస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. జిల్లా, రాష్ట్ర అధికారులు పరిశీలించడానికే పరిమితమయ్యారు.
- పాలశీతలీకరణ కేంద్రం, పశువుల చర్మాలను శుభ్రం చేసి రంగులు వేసే ప్రభుత్వ ట్యానింగ్ కేంద్రానికి తాళాలు పడ్డాయి. ఈ రెండింటిని తెరిపిస్తే రెండువేల మందికి ఉపాధి లభిస్తుంది. రైల్వే భవనాల్లో ప్రభుత్వం ప్రారంభించిన మహిళా కుట్టుశిక్షణ కేంద్రం, విద్యుత్తు మీటర్లను పరీక్షించే కంప్యూటర్ టెస్టింగ్ కేంద్రాలతో పాటు పాతగుంతకల్లు, సాయినగర్, భాగ్యనగర్, బెంచికొట్టాల, మొదీనాబాదుల్లోని తాగునీటి శుద్ధి కేంద్రాలు మూలనపడ్డాయి. వీటిని వినియోగంలోకి తేవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నిరుద్యోగులు విన్నవిస్తున్నారు. మూతపడిన పరిశ్రమల విలువ దాదాపు రూ.400 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

అధ్యయనం చేసి నివేదిక పంపుతాం

ట్యానింగ్ కేంద్రాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై అధ్యయనం చేసేందుకు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిని త్వరలోనే పంపుతాం. ఆయన ఇచ్చే నివేదికను ప్రభుత్వానికి పంపించి పరిశ్రమను తిరిగి తెరిపించేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కోరతాం. మిగిలిన వాటినీ పరిశీలిస్తాం.
- విజయలక్ష్మి, జడ్పీ సీఈవో, అనంతపురం

(c) eenadu

అనంతపురం
• అనంతపురం • రాప్తాడు

రెడ్‌క్రాస్‌కు ఐదు గవర్నర్ పతకాలు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్ వచ్చాయి. ఇందులో భాగంగా మెంబర్‌షిప్ కేటగిరీ కింద సొసైటీ ఛైర్మన్‌గా ఉన్న గత కలెక్టర్ వినోద్‌కుమార్, అప్పటి గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి, సామాజిక సేవ (సీఎస్ఆర్) కేటగిరీ కింద మోబిస్ ఇండియా మాడ్యుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్‌కు, సప్తగిరి కాంపర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గవర్నర్ అవార్డులు వచ్చాయి. వీరు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.

ధన వర ప్రదాతగా ఉమామహేశ్వరుడు

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరుడిని ఏడాదికోసారి (శ్రావణమాసం మూడో సోమవారం నాడు) కుబేరమూర్తిగా, ధన వర ప్రదాతగా దర్శించుకోవడం ఆనవాయితీ. ఆమేరకు సోమవారం పరమేశ్వరుడిని రూ.80 వేలు విలువజేసే కరెన్సీతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చక బృందం రుద్రాభిషేకంతో ఉత్సవాన్ని ప్రారంభించి అష్టోత్తర శతనామావళి, హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో నీలకంఠుడు

నగర దారుల్లో నరకమే

ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదల

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరంలోని రోడ్లు వాహనాలు నిలిపే స్థలాలుగా మారాయి. విశాలమైన రోడ్లు సైతం చిన్నబోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి. నగరంలోని పలు ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో 'న్యూస్‌టుడే' పరిశీలించగా డొల్లతనం బయటపడింది. ఇటీవల నగరపాలికలో 50 పార్కింగ్ ప్రదేశాలను నగరపాలక, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గుర్తించే ప్రక్రియ పూర్తి చేశారు. టెండర్లు పూర్తయినా ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్న పరిస్థితి.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

పాతూరులో నాలుగు వైపులా

తాడిపత్రి బస్టాండ్ పాతూరు మార్కెట్ ట్రాఫిక్ చదరంగంలో చిక్కుకుంది. గాంధీ విగ్రహానికి నాలుగు వైపులా వాహనాలు నిలపడానికి అడ్డాగా మారింది. ఇక్కడ కనీసం నడవడానికి కూడా స్థలం ఉండడం లేదు.

నో పార్కింగ్ బోర్డు పెట్టినా

శ్రీకంఠం కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. గౌరి థియేటర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో నోపార్కింగ్ బోర్డు పెట్టినా ఆటోలు పక్కనే నిలుపుతున్నారు. ఇక్కడే ఆర్టీసీ బస్సులు ఆగాల్సి రావడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి.

ఇబ్బందికరంగా త్రివేణి వంతెన

అసలే ఇరుకు ఆపై వాహనాలను అడ్డంగా ఉంచుతుండడంతో త్రివేణి వంతెన వద్ద నిత్యం ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

పాదచారులకు అవస్థలు

గడియారం స్తంభం వద్ద కన్యకాపరమేశ్వరి ముఖద్వారం పక్కన పార్కింగ్ ప్రదేశం ఎంపిక చేశారు. ఇక్కడ ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డుపైనే నిలుపుతూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద

ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో వాహనదారులు రహదారికి అడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. ఓ వైపు బస్టాండ్ నుంచి బస్సులు, మరోవైపు శ్రీకంఠం కూడలి వైపు రాకపోకలు, గుత్తి రోడ్డు వైపు రాకపోకలు సాగించే వాహనాలతో రద్దీగా ఉంటోంది.

ఉదయపు నడకకు వచ్చే వారివే

పీటీసీ మైదానం వద్ద ఉదయం, సాయంత్రం రోడ్డుకు ఇరువైపులా వందల్లో వాహనాలు ఆపుతున్నారు. మైదానంలో ఉదయం, సాయంత్రం నడకకు వచ్చే వారి వాహనాలతో ఈ మార్గం కిక్కిరిసి పోతోంది.

బంగారు వీధిలో

పాతూరు బంగారు వీధిలో వరుసగా దుకాణాలు ఉండడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను 20 అడుగుల రోడ్డులో ఆపుతున్నారు. దీంతో వెళ్లేందుకు దారి ఉండడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: వేణుగోపాల్ నగర్ ఆటోస్టాండ్ వద్ద శునకాలతో ఇబ్బందిగా ఉంది. - **మహేశ్**
సమాధానం: వెంటనే వీధి కుక్కలను తరలించి ఆపరేషన్లు చేయిస్తాం.
సమస్య: ఆదర్శనగర్ శివారులో చెత్త అంతా రోడ్డుపై పడేస్తున్నారు. - **ప్రదీప్‌కుమార్**
సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి చెత్త లేకుండా శుభ్రం చేయిస్తాం
(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి రాజా రవీంద్రనాథ్ చౌదరి సమాధానాలు ఇచ్చారు) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

వినాయక చవితి ఉత్సవాలకు అంకురార్పణ

అనంత సాంస్కృతికం: నగరంలోని సప్తగిరి కూడలిలో వినాయక ఉత్సవ కమిటీ శిబిరానికి సోమవారం అంకురార్పణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత అనంతగా మార్చేందుకు మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి వినాయకుడి ప్రతిమలను ఏర్పాటుచేయాలని కోరారు. జిల్లాలో సప్తగిరి వినాయక శిబిరానికి ప్రత్యేకత ఉందన్నారు. ఉత్సవాలకు అన్ని విధాలా సహకరిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, నగరాధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్‌అహ్మద్, భాజపా జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేశ్, లలిత్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యుడు రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

సమస్యల సాధనకు నర్సుల సంతకాల సేకరణ

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న నర్సులు తమ సమస్యల సాధనలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు 11వ రోజుకు చేరాయి. సోమవారం అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో కాంట్రాక్టు నర్సులు సంతకాల సేకరణ చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులందరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కరోనా సమయంలో నర్సుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీఐటీయూ నేతలు నాగేంద్ర, రాజామోహన్ మద్దతు తెలిపారు. నాయకురాళ్లు ప్రశాంతి, సుజిత, నారాయణమ్మ, లావణ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'చాలీచాలని వేతనంతో ఇంకెన్నాళ్లు'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: చాలీచాలని వేతనంతో ఎన్నాళ్లు వేచి చూడాలని నగరంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం వాచ్‌మెన్‌లు, స్వీపర్లు విన్నవించారు. సోమవారం నగరపాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నగరపాలక కమిషనర్ జస్వంతరావు, ఎస్ఈ రాజశేఖర్‌లు ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని పలు సమస్యలపై మొత్తం 9 ఫిర్యాదులు అందాయి. ఇంజినీరింగ్‌లో 6, శానిటేషన్‌లో 1, రెవెన్యూలో 2 ఫిర్యాదులు వచ్చాయి.

మా డబ్బు ఇప్పించండి సార్

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్కైబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయి జిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్కైబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు.

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం కీలకం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి సాధనలో అన్ని బ్యాంకులూ పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కావాలని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో జేసీ విష్ణుచరణ్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విస్తృతంగా రుణాలు ఇవ్వాలని ఎంపీ అన్నారు. చేతివృత్తులు, నైపుణ్యాల సాధనకు ఎక్కడికక్కడ బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం అనురాధ, ఎస్‌బీఐ ఆర్ఎం శశిధర్, యూబీఐ ఆర్ఎం వంశీకృష్ణ, ఆర్‌బీఐ మేనేజర్ రామకృష్ణ, వివిధ బ్యాంకుల సమన్వయ అధికారులు పాల్గొన్నారు.

సంచార జాతుల జీవన ప్రమాణాల్లో మార్పులు తెస్తాం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే భాజపా లక్ష్యమని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందజేయాలన్నదే ప్రభుత్వ అభిమతమని వెల్లడించారు. సోమవారం భాజపా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత లలితకళా పరిషత్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో భాజపా అనుబంధ సంస్థల రాష్ట్ర కన్వీనర్ కనుంపల్లి చిరంజీవిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, గుడిసె దేవానంద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, జిల్లా భాజపా అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై భాజపా నాయకులు

సమన్వయంతో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

అరవిందనగర్ (అనంతపురము), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారం సమన్వయం, సాధనతో సాధ్యమని వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేశ్ బాబు పేర్కొన్నారు. నగరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛన్‌దారుల పెండింగ్ సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తోందన్నారు. సెప్టెంబరు 5న జరగనున్న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

చూడకుంటే.. గుంతలోకే

మండలంలోని బండమీదపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై మురుగు కాలువకు మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు గుంతను గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, రాప్తాడు**

మురుగు పారదు.. దుర్వాసన వదలదు

జేఎన్‌టీయూ సమీపంలోని ఎల్ఐసీ కాలనీ, కేఎం కాలనీ తదితర ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా శుభ్రం చేయడంలేదు. దీంతో మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు ముందుకు సాగడం లేదు. దోమల స్వైరవిహారంతో రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వారు విన్నవిస్తున్నారు. - **న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ**

నగరపాలక ఎస్ఈకు పదోన్నతి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలక ఎస్ఈ రాజశేఖర్‌కు చీఫ్ ఇంజినీర్‌గా (సీఈ) పదోన్నతి లభించింది. ఆయన సీనియార్టీ జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. వారం రోజుల్లోపు ప్రదేశం కేటాయించి పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి పురపాలక పరిపాలనా పట్టణ అభివృద్ధి శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

పాలకుల వైఖరికి నిరసనగా సమ్మె

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఐదు నెలలుగా వేతనాలు అడుగుతున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం స్పందించకపోవడం అన్యాయమని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వీ నాయుడు, నాగేంద్ర విమర్శించారు. పాలకుల వైఖరికి నిరసనగా సోమవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు వారు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా వారు దీక్షలు చేపట్టారు. వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. బకాయి వేతనాల కోసం కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇచ్చినా స్పందన శూన్యమన్నారు. విధిలేని పరిస్థితిలోనే సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. నిరసనలో శ్రీసత్యసాయి నీటి సరఫరా కార్మికుల సంఘం కార్యదర్శి వన్నూరప్ప, కోశాధికారి శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, రామకృష్ణ, ఓబిలేసు, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష చేస్తున్న కార్మికులు

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, అనంతపురము

DISPUTE No.DRA/CFS 13/2026

BETWEEN:
M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt Ltd., Ananthapuramu, Rep. by its Manager/Foreman. ...**DISPUTANT**

VERSUS

R.SREENIVASULU and others

Opponents No. 2 to 4కు నోటీసులు

2) N.JANARDANA, S/o N.KRISTAPPA, HINDU, AGED ABOUT 51 YEARS, WORKING AS A WORK INSPECTOR, O/o DY. EXE. ENGINEER, P.R.T. SUB DIVISION, TADIPATRI, ANANTHAPUR (DIST), R/o D.No.13-882-1, MARUTHI NAGAR, TADIPATRI.
3) V.C SREENIVASULU, W/o V.C.RAMANAIAH, HINDU, AGED ABOUT 52 YAERS, WORKING AS A RECORD ASST., O/o DEPUTY DIRECTOR, ANIMAL HUSBENDARY, PENUKONDA, SRI SATYA SAI (DIST), R/o D.No.1-650, NEAR BAJAJ SHOWROOM, PENUKONDA, SRI SATYA SAI (DIST).
4) T. ADINARAYANA, S/o T.RAMUDU, HINDU, AGED ABOUT 48 YEARS, WORKING AS A RECORD ASST., Z.P. HIGH SCHOOL, JUTURU (V), PEDDAPAPPUR (M), ANANTHAPUR (DIST), R/o D.No.001, PUTLUR (V) & (M), ANANTHAPURAMU (DIST).

డిస్ప్యూటెంట్ బాకీ మొత్తం 7,36,913/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponents No. 2, 3, 4 అయిన మీరు తేదీ 16.09.2026వ ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu నందు హాజరై ఏటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల మీపై దావా పరోక్షంగా తీర్మానించబడును.

By Order of the Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU

E.P. No. 452/2014 in O.S.No. 75/2004

Between:
Ballarapu Sankara Reddy, R/at Pathakothacheruvu Village & Post, Guntakal Mandal, Ananthapuram Dist. .. **Petitioner/D.Hr**

And

1. D.Puspa Leelavathi (died by LRs)
2. D.Jagadeesh Babu, S/o Late D.Ramadasu, R/at Door No. 12-2-776, Ashok Nagar, Ananthapuram,
3. D.Karuna Kumari, W/o Bheemappa,
4. G.Suneela Devi, W/o G.Anjineyulu, Both are R/at Door No. 12-339, Ashok Nagar, Ananthapuram.

..**Respondents/J.Drs**

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drs కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొన దలచినవారు 16-09-2026వ తేది ఉదయం 10.30 గంIIలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

Properties situated in Ananthapuram Municipal Corporation limits and with in RD & SRD of Ananthapuramu. Door No. Old No. 12/339, New: 12/2/773, 12/2/775, 12/2/776. bounded by **East:** T.Ramana Property, **West:** Vanka, **South:** Sandu, **North:** K.Onnurappa Property.
Ameena Value: Rs. 30,00,000/-
D.Hr Value: Rs. 10,00,000/-
Market Value: Rs. 69,63,300/-
(By order of the Court)

MUTHYALA CHANDRA SEKHAR, Advocate, Anantapuramu, Cell: 9441665277

కేసుల కొట్టివేతపై సీపీఐ హర్షం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: మిస్సమ్మ కాలనీలో గుడిసెలు వేసుకున్న బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి వారి సోదరులు వేసిన 14 కేసులను జిల్లా కోర్టు కొట్టివేయడంపై సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలు అఖిలపక్ష పోరాట కమిటీగా ఏర్పడి పోరాటాలు నిర్వహించినట్లు వారు వెల్లడించారు. 14 ఏళ్ల తర్వాత కోర్టు తీర్పు పేదలకు అనుకూలంగా రావడం న్యాయం విలువ పెంచిందన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: వందేభారత్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజీవ్‌కాలనీ సమీపంలో సోమవారం సాయంత్రం యశ్వంతపూర్ నుంచి కాచిగూడ వెళ్తున్న వందేభారత్ రైలు కింద గుర్తుతెలియని వ్యక్తి పడ్డాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉంటుందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన మహిళ సోమవారం పోలీస్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. గుల్జార్‌పేటకు చెందిన నాగలక్ష్మి కుమారుడు ధీరజ్ బళ్లారి రోడ్డులోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గతనెల 22న తోటి విద్యార్థి హర్షిత్ తరగతి గదిలో గొడవపడి ధీరజ్‌పై దాడిచేశాడు. ఈ ఘటనలో ధీరజ్ కంటికి గాయమైంది. అయితే విషయం పాఠశాల ప్రిన్సిపల్, తరగతి టీచర్‌కు తెలిసినా తల్లిదండ్రులకు తెలపకపోగా, చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. దీనిపై ప్రశ్నిస్తే ప్రిన్సిపల్, యాజమాన్యం ఎదురుదాడి చేసి మానసికంగా వేధింపులకు గురిచేశారని ఆమె వాపోయారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కాగా సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అధికారులు 85 ఫిర్యాదులు స్వీకరించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను వీసీ జ్యోతికుమార్ సోమవారం సన్మానించారు. స్టాటిస్టిక్స్ విభాగం ఆచార్యురాలు పుష్పాంజలి, అలాగే సీనియర్ అసిస్టెంట్ దేవేంద్రనాయక్, జూనియర్ అసిస్టెంట్లు సైమన్‌కేఫా, లక్ష్మీనరసింహులు కూడా ఉద్యోగ విరమణ పొందారు. వీరిని వీసీ సన్మానించారు.

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్, వీసీ వ్యక్తిగత కార్యదర్శి నూర్‌మహమ్మద్ ఉద్యోగ విరమణ చేయడంతో సోమవారం ఆయన్ను వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య సుదర్శనరావు సన్మానించారు. వీసీ మాట్లాడుతూ వృత్తిలో చిత్తశుద్ధిగా వ్యవహరించిన వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, ఓఎస్‌డీ దేవన్న, బోధన, బోధనేతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య పుష్పాంజలిని సన్మానిస్తున్న ఎస్కేయూ వీసీ, రెక్టార్ తదితరులు

ప్రధాన పైప్‌లైన్ లీకేజీకి అడ్డుకట్ట

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలికకు తాగునీరు సరఫరా అయ్యే పీఏబీఆర్ ప్రధాన పైప్‌లైన్‌కు అనంతపురం గ్రామీణం రాచానపల్లి వద్ద లీకేజీ ఏర్పడింది. ఉదయాన్నే పనులు ప్రారంభించి లీకేజీని యుద్ధ ప్రాతిపదికన నివారించారు. సోమవారం ఉదయం పైపులైన్ లీకేజీ కావడంతో నగరపాలక తాగునీటి విభాగం ఇంజినీరింగ్ అధికారులు సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లి, పనులు ప్రారంభించారు. మధ్యాహ్నానికి పనులు పూర్తి చేశారు. బళ్లారి బైపాస్ విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద చిన్నపాటి లీకేజీ ఉండడంతో అరికట్టారు. సాయంత్రానికి నగరంలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు పంపిణీ చేశారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉద్యోగులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసమే దశల వారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు వెల్లడించారు. ఈ క్రమంలో కీలక నేతలపై రాజకీయ పార్టీలను ముడిపెట్టి మాట్లాడడం సబబు కాదని వారు హితవు పలికారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జేఏసీ సారథ్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి.. జేసీ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఐకాస జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, సహ ఛైర్మన్ మల్లరాయుడు, కోశాధికారి సంతోశ్‌గౌడ్, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సురేఖరావు మాట్లాడుతూ బొప్పరాజు వెంకటేశ్వర్లుపై అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. జేఏసీ అమరావతి జిల్లా ప్రధాన నాయకులు నాగవేణి, శివానందరెడ్డి, చెన్నప్ప, సోమశేఖర్, పునిత్‌బాబు, శ్రీనివాసమూర్తి, కలందర్, భాస్కర్, వెంకట నరసయ్య, ఓబిలేసు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

టెట్ మినహాయింపునకు యూటీఎఫ్ డిమాండ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కోసం పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం నగరంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరప్ప, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1)ను చట్ట సవరణ చేయడం ద్వారా టీచర్లకు టెట్‌ను మినహాయించే అవకాశం ఉన్నా, ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ప్రత్యేక నోటిఫికేషన్ వెలువరించడం విడ్డూరమన్నారు. నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, ఆడిట్ సభ్యుడు రమణయ్య, ఉపాధ్యక్షులు సరళ, చంద్రమోహన్, గోవిందరాజులు, గంగాధర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు జెండాలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

(c) eenadu